


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 219, పేజీలు - 08

శుక్రవారం, డిసెంబర్ 20, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## అరెస్టు నుంచి రక్షణ కల్పించలేం

- మోహన్ బాబుకు తేల్చి చెప్పిన హైకోర్టు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పోలీసులు అరెస్టు చేయుకండా ఉండేందుకు మంచు మోహన్ బాబు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన జర్నలిస్టుపై చేసిన హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా జరిగిన విచారణలో కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వం తరపు న్యాయవాది సమయం అడిగారు. దీంతో కేసును సోమవారానికి హైకోర్టు వాయిదా వేసింది. అయితే ఈ లోపు తన క్లయింట్ ను పోలీసులు అరెస్టు చేస్తారేమోనని అప్పటి వరకూ అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని మోహన్ బాబు న్యాయవాది కోరారు. కానీ ఇప్పటికిప్పుడు అలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని కౌంటర్ దాఖలు చేసిన తర్వాతనే విచారణ జరుపి నిర్ణయం

2లో..

## ఈ-కార్ రేసింగ్ కేసులో

# ఏ1గా కేటీఆర్

### - 4 నాన్ బెయిలబుల్ సెక్షన్లు నమోదు

- అనుమతులు లేకుండా రూ. 55 కోట్లు చెల్లించినట్టు ఆరోపణ
- కేసులో ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్
- కేటీఆర్ కు నోటీసులు ఇచ్చి, విచారణకు పిలిచే అవకాశం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో అతిపెద్ద సంచలనం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదైంది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారంటూ ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ కింద కేటీఆర్ మీద ఏసీబీ కేసు నమోదు చేసింది. 13(1)ఏ, 13(2) పీసీ యాక్ట్ కింద ఏసీబీ కేసులు నమోదు చేసింది. వాటితో పాటు 409, 120బీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసింది. మొత్తంగా నాలుగు సెక్షన్ల కింద కేటీఆర్‌పై ఏసీబీ కేసులు నమోదు చేసింది. ఫార్ములా ఈ- రేసింగ్ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎస్ రెడ్డిగా ఏసీబీ పేర్కొంది. ఇదే క్రమంలో నాంపల్లి ఏసీబీ కోర్టుకు అధికారులు ఎఫ్ఐఆర్ కాపీని సమర్పించారు. మాజీ మంత్రి కేటీఆర్ మీద పీసీ యాక్టు కింద కేసు నమోదు చేసినట్టు కోర్టుకు ఏసీబీ అధికారులు తెలిపారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా ఓ విదేశీ సంస్థకు నిధుల బదలాయింపు జరిగిందన్నది ప్రధాన అభియోగం కాగా అధికార దుర్వినియోగం చేశారన్నది మరో అభియోగంగా తెలుస్తోంది. కేబినెట్ ఆమోదం లేకుండా మంత్రిగా ఉన్న కేటీఆర్ తన సొంత నిర్ణయంతో హెచ్ఎండీఏ బోర్డు నుంచి విదేశీ

2లో..

## రాహుల్ పై హత్యాయత్నం కేసు

- పార్లమెంటు ఘర్షణ కేసులో బీజేపీ ఫిర్యాదు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** గురువారం ఉదయం పార్లమెంటు వద్ద తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. పార్లమెంటు ప్రాంగణం వద్ద అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమి నేతల మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టగా అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పార్టీ ఎంపీలు కూడా నిరసన చేపట్టారు. దీంతో ఇరువర్గాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే అక్కడ జరిగిన తోపులాటలో ఇద్దరు ఎంపీలు గాయపడినట్లు బీజేపీ తెలిపింది. అయితే ఆ ఎంపీలను రాహుల్ గాంధీ తోసేయడం వల్లే ఆ ఇద్దరు ఎంపీలకు గాయాలైనట్లు బీజేపీ ఆరోపణలు గుప్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్, బీజేపీ ఎంపీ బన్సూరీ స్వరాజ్ సహా బీజేపీ ఎంపీల బృందం రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి ఫిర్యాదుతో ఢిల్లీ పోలీసులు రాహుల్ గాంధీపై హత్యాయత్నం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాహుల్ గాంధీ

2లో..

## ఇంటర్ విద్యార్థులకు తీపికబురు

- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం
- 1.40 లక్షల మందికి లబ్ధి
- అమరావతి పనులకు గ్రీన్ సిగ్నల్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోని 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకం అమలు చేసేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు మంత్రి పార్థసారథి వివరాలు వెల్లడించారు. రాజధాని అమరావతికి వరల్డ్ బ్యాంక్, ఏడీబీ నిధులు ఇవ్వగా 45 ఇంజినీరింగ్ పనులు రూ.33,137 కోట్లతో పూర్తి చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. అలాగే, పోలవరం ప్రాజెక్ట్ ఎడమ కాల్వ పనులకు మళ్లీ టెండర్లు పిలిచే ప్రతిపాదనలకు, హంద్రీనీవా సుజల స్రవంతి రెండో దశ పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్‌కు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. డోన్, ఉద్దానం, పులివెందులలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. స్థిరమైన నీటి వనరుల వినియోగం ద్వారా తాగునీటి వసతి ఇవ్వాలన్నదే దీని ముఖ్య ఉద్దేశమని చెప్పారు. గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని.. రూ.26,804 కోట్ల ప్రతిపాదనలు పంపి కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. చిన్న రాష్ట్రాలు కూడా రూ.లక్ష కోట్లకు పనులు చేసుకున్నాయని చెప్పారు. గతంలో చేపట్టకుండా నిలిచిపోయిన పనులను పునఃపరిశీలిస్తామన్నారు. అనంతరం ప్రాజెక్టులు తిరిగి చేపట్టేందుకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

### - కేబినెట్ నిర్ణయాలివే..

?అమరావతిలో మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం. హడ్కో ద్వారా రూ.11 వేల కోట్ల రుణం తీసుకునేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్. అలాగే,

2లో..

## కలాలకు పదును పెట్టండి

- సీఎం రేవంత్ పిలుపు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉద్యమాల పట్ల చరిత్రకారులు వాస్తవాలను రాయకపోతే అసలైన పోరాట యోధులు, ఉద్యమాల్లో అసువులు బాసిన అమరుల గురించి భవిష్యత్తు తరాలకు అసంపూర్తి సమాచారమే అందుబాటులో ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందువల్ల వాస్తవాలను సమాజం ముందు ఆవిష్కరించాలంటే కవులు, కళాకారులు తమ కలాలకు పదును పెట్టాలని, తమ గళాలను విప్పాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఎన్టీఆర్ స్టేడియంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఏర్పాటు చేసిన 37వ పుస్తక ప్రదర్శనను ముఖ్యమంత్రి రేవంత్ ప్రారంభించారు. తర్వాత బోయి విజయ భారతి వేదికగా ఏర్పాటు చేసిన సదస్సులో ప్రసంగించారు.

2లో..

## ఓఆర్ఆర్ లీజు టెండర్లపై సిట్

### - సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు టోల్ టెండర్లపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తామని తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఔటర్ రింగ్ రోడ్డు టోల్ కాంట్రాక్టుపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కోరిక మేరకు విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జైకా నుంచి నిధులు తెచ్చి ఓఆర్ఆర్ నిర్మించారని రేవంత్ తెలిపారు. అయితే, దాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పనంగా టెండర్ ను ఎవరికో అప్పగించిందని మండిపడ్డారు. ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్, ఐటీ కంపెనీలను తీసుకొచ్చి హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేసింది కాంగ్రెస్సేనని అన్నారు. ఆ క్రెడిట్ అంతా కాంగ్రెస్ కే దక్కుతుందన్నారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు కృష్ణా, గోదావరి నీళ్లు తేవడానికి పీజేఆర్ ఉద్యమాలు చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్‌కు మెట్రో రైలు తీసుకొచ్చింది కూడా కాంగ్రెస్సేనని అన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా మారడానికి కాంగ్రెస్సే కారణమని చెప్పారు. వేల కోట్ల ఓఆర్ఆర్ ఆస్తిని అప్పనంగా అమ్ముకున్నారని బీఆర్ఎస్ పై మండిపడ్డారు. ప్రజలు ఓడించబోతున్నారని తెలిసి అమ్మేసుకున్నారని రేవంత్ ఆరోపించారు. దేశం విడిచిపెట్టి పోవాలనే ఉద్దేశంతోనే ఓఆర్ఆర్ ఆస్తులను గత ప్రభుత్వాధినేతలు అమ్మేసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. హరీశ్ రావు విచారణ కోరారు, ఆయన కోరిక మేరకు సెట్ విచారణకు ఆదేశిస్తున్నట్లు రేవంత్ రెడ్డి

2లో..

## రాజీనామాకు సిద్ధం

- అసెంబ్లీలో హరీశ్ రావు సవాల్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. అసెంబ్లీలో గురువారం అప్పులపై చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందంటూ అందుకు సంబంధించిన వివరాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో హరీశ్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి సంవత్సరమే రూ. 1.25 లక్షల కోట్ల అప్పు చేసిందని హరీశ్ రావు ఆరోపించారు. తాను చెప్పింది తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా సమర్పిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు 7 లక్షల కోట్లు కాదని 4 లక్షల కోట్లేనని తెలిపారు. భూములు కుదువపెట్టి అప్పులు తీసుకునేందుకు

2లో..

## అవినీతే జరగనప్పుడు.. ఏసీబీ ఎక్కడిది?

### - తెలంగాణ భవన్ లో కేటీఆర్ ప్రెస్ మీట్

- ఈ ఫార్ములా వ్యవహారంపై చర్చ పెట్టే దమ్ము సీఎంకు లేదు
- ఆ లక్ష్యంతోనే కార్ రేస్ నిర్వహించామని కేటీఆర్ రియాక్షన్
- శాసనసభలో చర్చ పెట్టాలని కేటీఆర్ సవాల్
- సమాధానాలు చెప్పేందుకు తాను సిద్ధమని వ్యాఖ్య




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఈ ఫార్ములా కార్ రేస్ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడే హైదరాబాద్‌లో ఫార్ములా రేస్ 1 కోసం ప్రయత్నాలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఇందుకోసం గోపన్‌పల్లిలో 580 ఎకరాల భూ సేకరణకు ప్రయత్నాలు చేశారని అన్నారు. అయితే, 2004లో ఓడిపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని పక్కన పెట్టిందని చెప్పారు. తనపై ఏసీబీ కేసు నమోదు నేపథ్యంలో తెలంగాణ

2లో..

## మ్యానిఫెస్టోకే దిక్కులేదు.. విజన్ 2047 అంట



- ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలతో జగన్ సమావేశం
- చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్న జగన్
- చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించారని వ్యాఖ్య
- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని మండిపాటు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ మరోసారి విరుచుకుపడ్డారు. ఆరు నెలలు కూడా తిరగకముందే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఇంతటి వ్యతిరేకత గతంలో ఏ ప్రభుత్వంపై రాలేదని ఆయన అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ప్రతినిధులు,

2లో..

## నువ్వేమన్నా డిప్యూటీ లీడర్‌వా?

### - హరీష్ రావుపై మంత్రి కోమటిరెడ్డి తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడీగా సాగుతున్నాయి. అధికార, విపక్ష సభ్యుల మధ్య గురువారం మాటల యుద్ధం కొనసాగింది. సభా కార్యకలాపాలపై సరిగ్గా సమాచారం ఇవ్వడం లేదని ఎలాంటి సమాచారం లేకుండానే ఆర్థిక పరిస్థితిపై చర్చ పెట్టారని విపక్షాలు తీవ్ర అసహనం వ్యక్తం చేశాయి. సభ నడిపే తీరు ఇది కాదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తెలపగా శాసనసభ నిబంధనల ప్రకారం సభ నిర్వహించాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. సభ్యులకు కనీసం సమాచారం లేకుండా ఎలా మాట్లాడుతారని బీజేపీ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య అసెంబ్లీలో తీవ్ర వాగ్వాదం జరిగి సభలో గందరగోళం నెలకొంది.

### - స్పీకర్ సారీ చెబుతారా.?

కాగా, విపక్షాల విమర్శలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. 'సభ నిర్వహణలో కొంత సమాచారం లోపం జరిగింది. దీనికే స్పీకర్ సారీ చెబుతారా.?. స్పీకర్ కార్యాలయం తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండాల్సిందే. చిన్నపాటి సమాచార లోపానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు. హరీశ్‌రావు, అక్బరుద్దీన్ ఇద్దరూ సీనియర్ సభ్యులు. వారు ఏదైనా చెప్పాలనుకుంటే రిక్వెస్ట్ చేయాలి. అంతేకానీ హుకుం జారీ చెయ్యొద్దు. తప్పు చేస్తే తప్పకుండా క్షమాపణ చెబుతాం. ఎంతో ముఖ్యమైన అంశంపై సభలో చర్చ కొనసాగుతుండగా చర్చను పక్కదారి పట్టించేందుకే ఇదంతా చేస్తున్నారు. సభ సజావుగా జరగాలని బీఆర్ఎస్ నేతలు భావించడం లేదు. ప్రభుత్వపరంగా ఏదైనా పొరపాటు జరిగితే శాసనసభ వ్యవహారాల మంత్రిగా నేను బాధ్యత తీసుకుంటాను. జవాబుదారీగా ఉంటా, అంతేకానీ స్పీకర్ క్షమాపణ చెప్పాలంటే ఎలా సాధ్య అవుతుంది.?' శ్రీధర్ బాబు ప్రశ్నించారు.

### - కేసీఆర్ ఎక్కడున్నారు - కోమటిరెడ్డి

అటు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హరీష్ రావు మధ్య కూడా అసెంబ్లీలో వాడీవేడీ వాదన సాగింది. నల్గొండ జిల్లాలో నీటి సమస్యపై మంత్రి ప్రస్తావించారు. ఓ వైపు ఫ్లోరైడ్, మరోవైపు మూసీ మురుగునీటితో ప్రజలు దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో పూర్తి చేసిన

2లో..

# అరెస్టు నుంచి రక్షణ కల్పించలేం

తీసుకుంటామని తెలిపింది. ఈ ప్రకారం మోహన్ బాబును పోలీసులు అరెస్టు చేయాలనుకుంటే అడ్డంకులు లేవని అనుకోవచ్చు. మంచు మనోజ్, మోహన్ బాబు మధ్య జరిగిన చిన్న ఘర్షణ వివాదం చినికి చినికి గాలివానగా మారింది. అది పోలీస్ స్టేషన్లు, కేసుల వరకూ వెళ్లింది. ఈ క్రమంలో ఈ విషయాలు రిపోర్టు చేయడానికి మీడియా జల్ పల్లిలోని మంచు ఇంటి ముందు పడిగాపులు పడింది.

గొడవ జరిగిన రోజున మంచు మనోజ్ ఇంటి తలుపులు తోసుకుని లోపలికి వెళ్లిపోయారు. ఆ సమయంలో ఆయనతో పాటు వెళ్లిన మీడియాపై మోహన్ బాబు దాడికి దిగారు. ఓ టీవీ చానల్ జర్నలిస్టుకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేరారు. ఆయనకు ఆపరేషన్లు చేశారు. ఈ ఘటనలో మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు అయింది. అందకు ముందే ఆయనకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. గన్స్ సరెండర్ చేయాలని అందులో పేర్కొన్నారు. పోలీసుల ఎదుట హాజరు కాకుండా కోర్టుకు వెళ్లి ఊరట పొందిన ఆయన..గన్స్ మాత్రం పోలీసులు రెండు సార్లు వార్నింగ్ ఇచ్చిన తర్వాత సరెండర్ చేశారు. ఓ తుపాకీని చంద్రగిరిలో మరో తుపాకీని ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్ లో డిపాజిట్ చేశారు.

ఇప్పుడు అదే కేసులో అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో ప్రయత్నిస్తున్నారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన రాచకొండ సీపీ సుధీర్, మోహన్ బాబుకు కోర్టు ఇరవై నాలుగో తేదీ వరకు గడువు ఇచ్చిందన్నారు. ఆయనను అరెస్టు చేయడంలో ఎలాంటి ఆలస్యం లేదన్నారు. అయితే పోలీసు ఎదుట హాజరు కాకుండా మాత్రమే హైకోర్టు చాన్స్ ఇచ్చింది. కానీ ఆ తర్వాత హత్యాయత్నం కేసు నమోదు అయింది. ఇప్పుడు హైకోర్టు అరెస్టు విషయంలో రక్షణ కల్పించేందుకు నిరాకరించడంతో ఆయనను పోలీసులు అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇటీవల మోహన్ బాబు తన దాడిలో గాయపడిన టీవీ జర్నలిస్టును కూడా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి వచ్చారు.

# రాహుల్ పై హత్యాయత్నం కేసు

దాడి చేయడం దాడికి ప్రేరేపించారని ఫిర్యాదు చేసినట్లు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చెప్పారు. పార్లమెంటు ప్రాంగణంలో నిరసన జరిగినపుడు ఏం జరిగింది అనేది ఇప్పటికే తమ పార్టీ ఎంపీలు చెప్పారని వెల్లడించారు. ఇలాంటి వైఖరి ఆమోదయోగ్యం అయింది కాదని అంతేకాకుండా నేరపూరితమైందని పేర్కొన్నారు. అందుకే తాము రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పార్లమెంట్‌లోకి శాంతియుతంగా ప్రవేశించేందుకు ప్రతిపక్ష ఎంపీలకు భద్రతా సిబ్బంది వేరే మార్గాన్ని చూపించినా వారు పట్టుబట్టి రాహుల్ గాంధీ మాత్రం అదే దారిలో వెళ్లాలని పేర్కొన్నట్లు మరో ఎంపీ బన్సూరీ స్వరాజ్ వెల్లడించారు.

అయితే బీజేపీ చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యల నుంచి దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకే బీజేపీ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలతోపాటు అదానీ అంశంపై చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా లేదని రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఇక రాహుల్ గాంధీని కించపరిచేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఇలాంటి చర్యలకు దిగుతున్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు బీజేపీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక పార్లమెంటు ప్రాంగణంలో అధికార, విపక్ష పార్టీల ఎంపీల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొని తోపులాట జరుగుతుంటే అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది జోక్యం చేసుకోకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని హస్తం పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై లోక్‌సభ స్పీకర్ ఎలాంటి పక్షపాతం లేకుండా దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇక పార్లమెంటు ప్రాంగణంలో జరిగిన తోపులాటలో అధికార కూటమి ఎంపీల కారణంగా తమకు కూడా గాయాలు అయినట్లు పలువురు కాంగ్రెస్ పార్టీ మహిళా ఎంపీలు కూడా ఆరోపిస్తున్నారు.

# ఇంటర్ విద్యార్థులకు తీపికబురు

జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ ద్వారా రూ.5 వేల కోట్ల రుణానికి ఆమోదం.
- బుడమేరు, 10 జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో రుణాల రీషెడ్యూల్‌కు సర్కారు ఆమోదం.
- ధాన్యం కొనుగోలు కోసం మార్క్?ఫెడ్ ద్వారా రూ.వెయ్యి కోట్ల రుణానికి ఆమోదం, పోలవరం ఎడమ కాల్వ రీటెండర్‌కు అనుమతి.
- పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులకు అనుమతి.
- క్లీన్ ఎనర్జీ కోసం ఎన్టీపీసీ ద్వారా పెట్టుబడుల కోసం జాయింట్ వెంచర్ ఏర్పాటు. దీని ద్వారా 1.06 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి.
- రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడులతో విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు పుస్తకాల సరఫరాకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

### - రాష్ట్ర పర్వదినంగా రథసప్తమి

మరోవైపు, శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరసవెల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమిని రాష్ట్ర స్థాయి పర్వదినంగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రథసప్తమితో పాటే 3 రోజులు పర్వదినంగా నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. కాగా ఫిబ్రవరి 4వ తేదీన రథసప్తమి జరగనుండగా దేవస్థానం వేడుకలు నిర్వహిస్తుందని వెల్లడించింది.

### - మంత్రులకు సీఎం కీలక సూచన

అటు, సున్నిత అంశాలపై జాగ్రత్తగా మాట్లాడాలని సీఎం చంద్రబాబు మంత్రులకు సూచించారు. మంచి ఉద్దేశంతో మాట్లాడినా చెడుగా ప్రచారం చేసే వారుంటారని అన్నారు. ఢిల్లీలో అంబేద్కర్ విషయమై జరిగిన వ్యవహారం కూడా ఈ తరహాలోనిదేనని చెప్పారు. ఈ పరిణామాలపై మంత్రులతో చర్చించారు. 'గతంలో వ్యవసాయం దండగ అనకున్నా అన్నట్లుగా నాపై తప్పుడు ప్రచారం చేశారు. కాంగ్రెస్ హయాంలో అంబేద్కర్‌కు తగిన గౌరవం లభించలేదు. అంబేద్కర్ ఓడిపోయింది కూడా కాంగ్రెస్ హయాంలోనే. వీపీ సింగ్ హయాంలో పార్లమెంట్ ఆవరణలో విగ్రహం ఏర్పాటు చేశారు. ఎవరి ద్వారా అంబేద్కర్‌కు గుర్తింపు వచ్చిందనే దానిపై చర్చించాలి.' అని అమాత్యులకు సూచించారు.

# కలాలకు పదును పెట్టండి

చరిత్ర ఎప్పుడూ గెలిచిన వాళ్లు రాసుకునేదే చరిత్రగా ఆవిష్కృతమవుతోందని, పోరాటాల్లో అసులు బాసిన వాళ్లు, అమరులైన వారి గురించి చరిత్రలో కొంత నిర్లక్ష్యం గురికావడం, కొంత సమాచార లోపం ఉంటుందన్నారు. సాయుధ రైతాంగ పోరాటం, తొలి దశ తెలంగాణ ఉద్యమైనా, మలి దశ తెలంగాణ ఉద్యమమైనా.. ఉద్యమాల్లో సమిధలైన, అమరులైన వారికంటే, రాజకీయంగా ప్రయోజనం పొందిన వారి గురించే ఎక్కువ చర్చ జరుగుతుంది.

గత పదేళ్లుగా మన కళ్ల ముందున్న చరిత్రలో వాస్తవాలు, అవాస్తవాలు గమనించి కవులు, కళాకారులు తమ కలాలను పదును పెట్టాలి అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సమాజం అధునాతన యుగం వైపు, సాంకేతిక పరిజ్ఞానం వైపు వెళుతున్న సందర్భంలో డిజిటల్, సోషల్ మీడియాల వంటి మాధ్యమాల వల్ల ఏది వాస్తవమో, ఏది ఆవాస్తవమో గ్రహించే పరిస్థితులు లేకుండా పోతున్నాయి.

యువతను పుస్తక పఠనంవైపు మళ్లిస్తే వాస్తవాలు తెలుసుకునే వీలుంటుందన్నారు సీఎం రేవంత్. 1985లో సిటీ సెంట్రల్ లైబ్రరీలో చిన్నగా ప్రారంభించిన బుక్ ఫెయిర్ ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో చేపట్టడం, అందులోనూ ఎంతోమంది మేధావులు పాల్గొని వచ్చే తరానికి ఒక స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

బుక్ ఫెయిర్ నిర్వహకులు ప్రస్తావించిన విషయాలపై ప్రొ. కోదండరాం నివేదిక రూపంలో అందజేస్తే వాటిని పరిశీలించి సామాజిక బాధ్యతగా నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకూబ్, ఎమ్మెల్సీ కోదండరాం, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రొ. రమా మెల్కోటే, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తితో పాటు ఎంతో మంది ప్రముఖ కవులు, రచయితలు, కళాకారులు హాజరయ్యారు.

# ఓఆర్ఆర్ లీజు టెండర్లపై సిట్

చెప్పారు. విధి విధానాలు మంత్రివర్గంలో చర్చించి విచారణ చేయిస్తామన్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన హరీశ్ రావు తాను ఓఆర్ఆర్‌పై విచారణ కోరలేదన్నారు. అయినా కూడా తాను విచారణను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అయితే, ముందు ఆ టెండర్ రద్దు చేసి విచారణకు ఆదేశించాలని హరీశ్ రావు కోరారు.

# రాజీనామాకు సిద్ధం

బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని కాంగ్రెస్ సర్కారుపై ఆరోపణలు చేశారు. రూ. 75 కోట్లకు ఎకరం చొప్పున టీజీఐఐసీ భూములు అమ్మే ప్రయత్నం చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా మెస్ ఛార్జీలు పెంచిందని చెప్పారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలకు రాయితీ నిధులిచ్చామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాదే రూ. 1.25 కోట్లు అప్పు చేసింది. ఈ లెక్కన అప్పులు చేస్తే ఐదేళ్లలోనే గత ప్రభుత్వ అప్పును మించిపోతారన్నారు. తాము పదేళ్లలో రూ. 7 లక్షల కోట్లు అప్పు చేస్తే కాంగ్రెస్ సర్కారు అప్పు ఐదేళ్లలోనే రూ. 7 లక్షల కోట్లు దాటిపోతుందని హరీశ్ రావు అన్నారు. రెవెన్యూ రాబడి, రెవెన్యూ వ్యయం పరంగా చూస్తే తాము కూడా మిగులు బడ్జెట్ రాష్ట్రాన్నే ఈ ప్రభుత్వానికి అప్పగించామని హరీశ్ రావు తెలిపారు. రూ. 2.93 లక్షల కోట్ల బడ్జెట్ తో రాష్ట్రాన్ని కాంగ్రెస్ సర్కారుకు అప్పగించామన్నారు. తెలంగాణ సొంత ఆదాయం పదేళ్ల క్రితం రూ. 35 వేల కోట్లు ఉంటే పదేళ్లలో రూ. 1.50 వేల కోట్లకు పెంచామని హరీశ్ రావు చెప్పారు. కరోనా, కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగానే రాష్ట్రానికి ఆదాయం తగ్గిందని చెప్పుకొచ్చారు. ఆదాయం తగ్గడం వల్ల రాష్ట్రంపై కొంత అప్పుల భారం పడిందని పేర్కొన్నారు. తాము అప్పులు చేసినా రాష్ట్ర ఆదాయం పెంచామని చెప్పుకొచ్చారు.

# అవినీతే జరగనప్పుడు.. ఏసీబీ ఎక్కడిది?

భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో రేసుల కోసం పోటీ ఎప్పటి నుంచో ఉందన్నారు. ఈ కేసులో ఏమీ లేదని అసెంబ్లీలో చర్చ పెట్టే దమ్ము సీఎంకు లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలు ఈ కార్ రేసు కోసం పోటీ పడ్డాయని అన్నారు. 'హైదరాబాద్‌ను ఇన్నోవేషన్, రీసెర్చ్, మ్యానుఫాక్చరింగ్ హబ్ కావాలనే ఉద్దేశంతోనే ఈ కార్ రేస్ నిర్వహించాం. తాము తొలుత ఫార్ములా – 1తో సంప్రదిస్తే వారు రామన్నారు. ఎన్నో తంటాలు పడి ఒప్పించాం. 2023లో ఫిబ్రవరిలో మేము నిర్వహించిన రేస్ చూసి కేంద్ర మంత్రులు, బడా పారిశ్రామిక వేత్తలు సైతం మెచ్చుకున్నారు. రేవంత్ సర్కార్ కుంభకోణం, లంబకోణం అని కేబినెట్‌లో ఏదో సాధించినట్లు లీకులిస్తున్నారు.' అని కేటీఆర్ మండిపడ్డారు.

### - అదే లక్ష్యంతో రేస్ నిర్వహించాం

'నగరంలో ఈ కార్ రేస్ జరపాలని ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. 4 కోట్ల ప్రజల మధ్య ఈ అంశంపై చర్చ పెట్టాలని అసెంబ్లీ స్పీకర్‌ను కోరాను. ఫార్ములా ఈ కార్ రేస్ అంశంపై చర్చించే సత్తా ప్రభుత్వానికి లేదు. అక్రమాలు చేశామని సర్కారు అంటోంది. అవి నిరూపించకుండా లీకులిస్తూ ఆరోపణలు చేస్తున్నారు. ఫార్ములా 1 రేస్ ట్రాక్ కోసం గోపన్‌పల్లిలో భూసేకరణ జరిగింది. అక్కడ సీఎం రేవంత్‌రెడ్డికి కూడా 15 ఎకరాల భూమి ఉంది. ఎఫ్ 1 చుట్టూ నగరాల అభివృద్ధి ఆధారపడి ఉంది. ఈవీ పాలసీ తేవాలి. భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే అవుతుందన్న ఉద్దేశంతో ఫార్ములా ఈ కార్ రేస్ పెట్టాలని నిర్ణయించాం. ముందుచూపుతో ప్రభుత్వాలు కొన్ని కార్యక్రమాలు చేస్తాయి. చేయాలి. ఈ కార్ రేసింగ్ క్రెడిట్ పొందేందుకు బీజేపీ కూడా ప్రయత్నించింది. కేంద్రం సహకారంతోనే ఈ కారు రేసింగ్ జరుగుతోందని కిషన్ రెడ్డి అన్నారు. సచిన్, ఆనంద్ మహీంద్రాతో పాటు దేశంలోని చాలామంది ప్రముఖులు ఈ కార్ రేసింగ్‌ను ప్రశంసించారు. క్రికెటర్లు, బాలీవుడ్ ప్రముఖులను ఈ కార్ రేసింగ్ ఆకర్షించింది. ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వం కలిపి ఈ రేస్ కోసం పెట్టిన ఖర్చు రూ.150 కోట్లు అయితే, దాదాపు రూ.750 కోట్ల ఆదాయం వచ్చింది.' అని కేటీఆర్ వివరించారు.

### లగచర్ల చరిత్రలో నిలిచిపోతుంది

తెలంగాణ చరిత్రలో లగచర్ల పేరు నిలిచిపోతుందని కేటీఆర్ అన్నారు. 'లగచర్ల కేసులో జైలు నుంచి విడుదలైన నరేందర్ రెడ్డి, 28 మంది రైతులకు శుభాకాంక్షలు. ఓ నిరంకుశ, మూర?పు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా వారు చేసిన పోరాటం తప్పకుండా చరిత్రలో నిలిచిపోతుంది. లగచర్ల పేరు ఎప్పటికీ మర్చిపోరు. న్యాయవ్యవస్థ ద్వారా లభించిన ఈ విజయం కొడంగల్ రైతుల విజయం. మానసికంగా ఎంత చిత్రవధ చేసినా ఈ రోజు బెయిల్ సాధించుకొచ్చారు. నరేందర్ రెడ్డికి ఎన్ని అనారోగ్య సమస్యలున్నా రైతులను కాపాడాలని కోరారు.' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# మ్యానిఫెస్టోకే దిక్కులేదు.. విజన్ 2047 అంట

పార్టీ నేతలతో గురువారం జగన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంపై మనమంతా పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమయిందని జగన్ అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత వైసీపీకి అనుకూలంగా మారాలంటే ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాటం చేయాలని చెప్పారు. ప్రజల తరపున మనం గొంతు విప్పాలని పిలుపునిచ్చారు.
నాయకులుగా ఎదగడానికి మీకు ఇదొక అవకాశం అని చెప్పారు. మన ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి మనం ఎంతో చేశామని జగన్ చెప్పారు. అంతకంటే ఎక్కువ చేస్తానని చెప్పి ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరికీ చంద్రబాబు హామీలు ఇచ్చారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని అమలు చేశామని జగన్ చెప్పారు. మేనిఫెస్టోకు పవిత్రతను తీసుకొచ్చామని తెలిపారు. కరోనా వచ్చినా, ప్రభుత్వ ఆదాయం తగ్గినా, ఖర్చులు పెరిగినా సాకులు చూపకుండా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను, వాగ్దానాలను అమలు చేశామని చెప్పారు. తప్పుడు హామీలతో ప్రజలను చంద్రబాబు నమ్మించగలిగారని జగన్ చేశారు కదా చంద్రబాబు కూడా చేస్తారేమోనని ప్రజలు నమ్మారని అందుకే మనం పరాజయం చెందామని అన్నారు. ఆరు నెలలు గడవకుండానే చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించారని చెప్పారు. చంద్రముఖిని లేపడమంటే పులి నోట్లో తల పెట్టడమేనని ఆరోజు చెప్పానని ఈరోజు దాన్ని చంద్రబాబు నిజం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు బిర్యానీ పెడతానన్నారని ఇప్పుడు బిర్యానీ పోయింది, పలావు కూడా పోయిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు పథకాలు అందడం లేదని చెప్పారు. కరెంటు ఛార్జీల రూపంలో ప్రజలపై వేల కోట్ల భారాన్ని వేశారని మండిపడ్డారు. స్కామ్ ల మీద స్కామ్ లు నడుస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని చెప్పారు.

# నువ్వేమన్నా డిప్యూటీ లీడర్‌వా?

70 శాతం ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపించారు. పదేళ్లలో రూ.7 లక్షల కోట్లు అప్పు చేసినా దీన్ని పూర్తి చేయలేదన్నారు. తమ ప్రభుత్వం గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తి చేసిందని చెప్పారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 40 లక్షల మంది జీవితాలను కాపాడాలని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. దీనిపై స్పందించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు 'సభలో ఓ మంత్రి లేచి మరో మంత్రిని ప్రశ్నించే పరిస్థితి ఉండకూడదు. ఇలా ప్రశ్నలు అడిగేందుకు అవకాశం ఇస్తే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుంది. లేని సంస్కృతిని తీసుకురావొద్దు.' అని పేర్కొన్నారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఘాటుగా స్పందించారు. 'హరీష్ రావు బీఆర్ఎస్‌కు డిప్యూటీ లీడరా? ఎమ్మెల్యేనా?. ఏ హోదాతో మాట్లాడుతున్నారు.?. ఆయనకు ప్రశ్నించే హక్కు లేదు. ప్రతిపక్ష నేత ఏడాదిగా సభకు హాజరు కాకపోవడం, తెలంగాణ ప్రజలను అవమానపరచడమే.' అంటూ మండిపడ్డారు.

# ఈ-కార్ రేసింగ్ కేసులో ఏ1గా కేటీఆర్

కంపెనీకి నిధులు బదలాయించినట్టు తెలుస్తోంది. కేటీఆర్ ఆదేశాలతోనే డబ్బులు చెల్లించినట్టుగా హెచ్ఎండీఏ అధికారులు కూడా ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే. ఆర్బీఐ అనుమతి లేకుండా ఓ విదేశీ సంస్థకు ఇండియన్ కరెన్సీ రూపంలో డబ్బు చెల్లించనట్టయితే రూ.8 కోట్ల పెనాల్టీ ఉంటుందని తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆర్బీఐ ఈ పెనల్టీ వేయటంతో ఈ రేసుకు సంబంధించిన మొత్తం వ్యవహారం బట్టబయలైనట్టు తెలుస్తోంది.

అయితే కేటీఆర్ మీద నమోదు చేసిన 13(1)ఏ ఉద్దేశ్యపూర్వకంగా నేరపూరితమైన చర్యలకు పాల్పడాన్ని ఈ సెక్షన్ చెప్తోంది. ఇక ప్రభుత్వ ప్రతినిధి అధికార దుర్వినియోగానికి పాల్పడితే అమలయ్యే 13 (2) పీసీ యాక్ట్ కింద నమోదు చేసిన విషయం తెలిసిందే. ఒకవేళ నేరం రుజువైతే ఏడాది నుంచి గరిష్ఠంగా ఏడేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందని తెలుస్తోంది.

మరోవైపు నేరపూరిత విశ్వాస ఉల్లంఘన కింద 409 సెక్షన్, ఒప్పందంలో కుట్రపూరితంగా వ్యవహించటానికి సంబంధించి 120బీ కింద కూడా కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉంటే తాను ఎలాంటి మోసం చేయలేదని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకే ఈ ఒప్పందం చేసుకున్నానని కేటీఆర్ ఇప్పటికే తెలిపారు. ఈ కేసులో ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమేనని చెప్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా అరెస్టుకు కూడా రెడీ అని తెలపటం గమనార్హం.

# కూటమి ప్రభుత్వంపై భూమన ఫైర్

**తిరుపతి** రాష్ట్ర ప్రభుత్వం పై మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. తిరుపతిని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చింది కూటమి ప్రభుత్వం. తిరుపతి పవిత్రతను కాపాడతానని చెప్పిన చంద్రబాబు వాస్తవంలో చేస్తున్నది స్వామి సన్నిధిని అపవిత్రం చేయడమేనని అన్నారు. మద్యం, మత్తుపదార్థాలు, డ్యాన్సులు, డీజేల వంటి దుష్ట సంస్కృతికి తిరుపతిలో బీజాలు వేస్తున్నారు. ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే ఉదయం 7 నుండి రాత్రి 12 దాకా మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. వీటిని కట్టడి చేయడానికి ప్రభుత్వం, పోలీసు అధికారులు కఠినంగా వ్యవహరించాలి. తిరుపతి పవిత్రతను, విశిష్టతను కాపాడాలని ఆయన అన్నారు.

# అశ్లీల నృత్యాల కేసులో 17మంది అరెస్టు

**ఏలూరు** ఏలూరు జిల్లా నిడమర్రు మండ లంలో బావయ్య పాలెం ఈనెల 12వ తేదీ రాత్రి రైస్ మిల్లులో జనసేనకి చెందిన నాయకుడు పుట్టినరోజు సందర్భంగా జరిగిన అశ్లీల నృత్యాలు ఘటనలో పోలీ సులు 17 మందిని అరెస్టు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులో కి వచ్చింది. ఈ నృత్యాలలో ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు హిజ్రాలను తీసుకొచ్చి ఫుల్లుగా మద్యం హిజ్రాలను నగ్నంగా ఉంచి చిందులు వేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. పుట్టి నరోజు పేరుతో అశ్లీల నృత్యాలు చేయడంపై గ్రామస్తులు మండిప డుతున్నారు. వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి ఇప్పటికే 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. భీమవరం కు చెం దిన ఇద్దరు హిజ్రాలు ఈ నృత్యా లలో పాల్గొన్నట్లు గుర్తించారు. అంతేకాక జనసేన సైతం దీనిపై చర్యలు చేపట్టింది.కు వినతి..

# ఏలేరు ఇరిగేషన్ వ్యవస్థ ఆధునీకరణ కు డీపీఆర్ రెడీ

**కాకినాడ** కొత్తగా ఎన్నికైన నీటి వినియోగదారుల సంఘాల సలహాలు, సూచనలతో ఏలేరు ఇరిగేషన్ వ్యవస్థ ఆధునీకరణకు రివైజ్డ్ డిపిఆర్ రూపొందించి ప్రభు త్వానికి సమర్పించాలని కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ నిర్ణయించిం దని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టనాభి వృద్ధి శాఖ మంత్రి పొంగనూరు నారాయణ తెలిపారు. కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో కాకినాడ జిల్లా సమీకా కమిటీ సమావేశం జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టనాభివృద్ధి శాఖ మంత్రి పొం గనూరు నారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, యంఎ ల్సీలు కర్రిపద్మశీ, బొర్రా గోపీమూర్తి, యంఎల్ఏలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ , యనమల దివ్య, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే ఎస్విఎస్ఎన్ వర్మ, జనసేన పిఠాపురం నియోజక వర్గ ఇన్ చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన , జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా అభివృద్ధికి జరుగుతున్న కార్యక్రమాల ప్రగతి, చేపట్టవలసిన భవిష్యత్ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాల గొకొన్నారు. ఇందులో భాగంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ, వ్యవసాయం, పురపాలన, పట్టణాభివృద్ధి, మెప్మా, కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, త్రాగునీటి సరఫరా, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్ అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. సమావేశంలో సూచించిన అంశాలు, నిర్ణయాలపై ప్రాధాన్యతల కనుగుణంగా సత్వర చర్యలు చేపట్టి, వచ్చే డిఆర్సి సమావేశం లోపు అన్నిటిపై చర్యలుకత పూర్తి చేయాలని జిల్లా ఇన్ చార్జి మంత్రి నారాయమ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన సమావేశంలో చర్చించిన అంశాలను మీడియా ప్రతినిధులకు ప్రెస్ మీట్ లో వివరించారు. సదరు వివరాలను ఈ విధంగా ఆయన తెలిపారుః ధాన్యం సేకరణ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల జిల్లాలో రైతుల ఖరీఫ్ ధాన్యానికి బహిరంగ మార్కెట్ లో మద్దతు ధర మించి మంచి ధర లభించి రైతులకు మంచి ధర లభిస్తోందని ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేసారు. ధాన్యాన్ని అకాల వర్షాల నుండి కాపాడుకునేందుకు, ఆరబెట్టేందకునేందుకు టార్పాలిన్ లను సబ్సిడిధరపై సరఫరా చేసేలా ప్రభుత్వాన్ని కోరాలని కమిటీ నిర్ణయించింది. వ్యవసాయ శాఖ సమీక్షలో జూన్ ల వర్షాలు ప్రారంభం అయ్యే లోపు కాలువలు, డ్రెయిన్లలో కలుపు, పూడిక పనులు కాలువలు మూసిన వేంటనే చేపట్టేందుకు సిద్ధం చేయాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు. రైతులకు నకిలీ విత్తనాల బెడద లేకుండా చూడాలని, నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. – ఉపాధిహామీ పథకం అమలు సమీక్షలో 50శాతం రైతులు, 50 శాతం ఉపాధి హామీ పదకం నిధులతో వ్యవసాయ పనులను ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టేలా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించాలేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలని కమిటీ నిర్ణయంచింది. ఇరిగేషన్ సమీక్షలో కాలువ శివారు భూములకు కూడా నీరందేలా షట్టర్ల రిపేర్లు, కాల్వల లైనింగ్ పనులు చేపట్టాలని కమిటీ అధికారులకు సూచించింది. నూతనంగా ఎన్నికైన నీటిసంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి వారి అనుభవాల నుండి సేరించిన సూచనలతో 845 కోట్ల నిధులతో ప్రతిపాదించిన ఏలేరు వ్యవస్థ ఆధునీకరణకు రివైజ్డ్ ప్రోజక్స్ రిపోర్టు రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి సమర్పించాలని కమిటీ నిర్ణయించింది. మన్సిపల్ పరిపాలన సమీక్షలో సాలిడ్ వేస్ట్ నియంత్రణకు ఇప్పటికే విశాపట్నం, గుంటూరులలో విజయవంతమైన వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్ ను రాజానగరం-కాకినాడల మధ్య ఏర్పాటు ప్రతిపాదించి, ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులకు కమిటీ సూచించింది. ఉప్పాడలో అన్నకాంటీన్ ఏర్పాటుకు నిర్ణయించింది. కాకినాడలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఉప్పుటేరుపై మూడవ బ్రిడ్జి , బైపాస్ రోడ్డు నిర్మించాలని కమిటీ నిర్ణయించింది. వచ్చే ఏప్రియల్ నుండి మున్సిపల్ పన్నుల నిధుల సిఎస్ఎఫ్ఎం పరిధి నుండి తప్పించి, స్థానిక సంస్థల పరిధిలోనే ఖర్చు చేసుకునేలా విధాన మార్పు చేయనున్నట్లు మంత్రి తెలియజేశారు. స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ క్రింద నిలిచిపోయిన పనులకు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేలు కోరారు. అలాగే మౌలిక సదుపాయాలు కల్పించి టిడ్కో గృహాలను లబ్దిదారులకు సత్వరం అందించాలని కోరారు.

# భయమన్నది బ్లడ్లోనే లేని నాయకుడు మా జగన్

**తిరుపతి** భయమన్నాది బ్లడ్ లో లేని నేత మా జగన్ మోహన్ రెడ్డి అని మాజీ మంత్రి రో?జా అన్నారు. ప్రజలను మోసం చేసి... ఈవీఎం లను మేనేజ్ చేసి కూటమి అధికారంలోకి వచ్చింది. వైసీపి నేతలు సొంత స్థలాలు ఇచ్చి గ్రామ సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లు కట్టించారని అన్నారు.

# అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

కాకినాడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ను ఉద్దేశించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అంబేద్కర్ ను అవమానించడమేనంటూ సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి పేర్కొన్నారు. గురువారం కాకినాడ ఇంద్రపాలెం బ్రిడ్జి సెంటర్లో అంబేద్కర్ విగ్రహానీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అమిత్ షాను కేబినెట్ నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. వారికి రాజ్యాంగంపై నమ్మకం లేదని, అమిత్షా దేశానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో దళిత సంఘ నాయకులు అయితా బత్తుల రామేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు...

# పర్యాటకులకు కనిపించిన పెద్దపులి

**ఆమ్రాబాద్** నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల్లలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పర హాబాద్ నుంచి వ్యూ పాయింట్ వరకు అటవీశాఖ అధికారులు నిర్వహిస్తున్న సఫారీ చేస్తున్న పర్యాటకులకు పెద్దపులి కనువిందు చేసింది. పరహాబాద్ వ్యూ పాయింట్ కు వెళ్లే దారిలో గుండం చెక్ పోస్ట్ వద్ద పులి కనిపించడంతో సందర్శకులు తమ సెల్ ఫోన్ లలో చిత్రీకరించారు...

# బలగం మూవీ ఫేమ్ మొగిలయ్య మృతి



**వరంగల్** బలగం సినిమాలో నటించిన మొగిలయ్య మృతి చెందారు. సంవత్సర కాలంగా అయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. వరంగల్ లోని సంరక్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. మొగిలయ్య మృతదేహంను తన స్వగ్రామం దుగ్గొండి కి తరలించారు. బలగం మూవీ క్లైమాక్స్ లో మానవ సంబంధాలను వివరిస్తూ మొగిలయ్య పాట పాడారు. తోడుగా మాతో ఉండి... నీడగా మాతో నడిచి అనే పాట మూవీలో హైలెట్ మొగిలయ్య మృతి పట్ల బలగం డైరెక్టర్ వేణు, నటీనటులు, గ్రామస్తుల సంతాపం వ్యక్తం చేసారు.

# కోర్టు ద్వారా "40"కోట్లు వసూల్: ఆర్కే

**ఇవ్వాల్సిన "40"కోట్లు ఇవ్వక,**
**ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం:ఆర్కే ఆరోపణ**
**ప్రతి సారి కోర్టు మెట్లు ఎక్కుతేనే న్యాయం జరుగుతుంది**
**టిపిటి బకాయిలు చెల్లించాల్సిందేనంటూ ఉన్నత న్యాయస్థానం తీర్పు**
**అరకొర నిధులతో బోర్డు పరిపాలన సాగుతుంది.సిఎం**
**రేవంత్ రెడ్డి వివక్ష వల్ల కంటోన్మెంట్ అభివృద్ధి శూన్యం**
**బోర్డు పరిధిలో ఉన్న ప్రజలు తెలంగాణ రాష్ట్ర బిడ్డలే,**
**పధకాలు లేవు,నీటిసరఫరాలో కూడా ప్రభుత్వం కక్షసాధింపు**
**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు**




రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన టిపిటి బకాయిల విషయంలో హైకోర్టు ను ఆశ్రయించిన బోర్డు నామినేటెడ్ సభ్యులు జె.రామకృష్ణ.తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు "40" కోట్ల రూపాయలు విడుదల చేసినందుకు ధర్మాసనం పేర్కొందని కంటోన్మెంట్ సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ తెలిపారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు (టిపిటి) ట్రాన్సీవర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఖజానాలో జమ అవుతున్న విషయం విదితమే.కానీ బోర్డుకి ఇవ్వాల్సిన వాట మాత్రం ఇవ్వక గత కొంత కాలంగా ఇబ్బందులు పెడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నిన్న గురువారం ఉన్నత న్యాయస్థానం సర్కారు నుంచి రావాల్సిన 40 కోట్ల రూపాయల బకాయిలను కోర్టు ద్వారా రాబట్టినట్లు కంటోన్మెంట్ సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ స్పష్టం చేశారు. కోర్టు తీర్పు నిన్న వెలువడిన నేపథ్యంలో మహేంద్ర హిల్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ టీపీటీ రూపంలో రావాల్సిన ప్రతి సందర్భంలోనూ రాష్ట్ర ప్రభుత్వ తరపున న్యాయవాది గడువు కోరుతూ దీన్ని పొడిగించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నిన్న బకాయిలను చెల్లించాలని ధర్మాసనం తీర్పునిచ్చింది.40 కోట్ల రూపాయల బకాయిలను తీసుకురావడంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఇటీవల విజయోత్సవ సంబరాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర పరిపాలన పూర్తి చేసుకున్నప్పటికీ కంటోన్మెంట్ బోర్డుకు బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేయడం సిగ్గుచేటని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. న్యాయస్థానాల చుట్టూ తిరిగి పలు వాయిదాలపర్వం కొనసాగినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడంలో విజయవంతం అయ్యామని అన్నారు. గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు సిఎం రేవంత్ రెడ్డి ఏమి చేయలేకపోయారని ముఖ్యమంత్రి హొదాలో ఉండి కూడా కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి విషయంలో ఇప్పటివరకు నయా పైసా కేటాయించింది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలంతా కాంగ్రెస్ పాలనపై విముఖత వ్యక్తం చేస్తున్నారని రానున్న రోజుల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

ఆర్కే: సికింద్రాబాద్ కంటోన్మెంట్ లో నెలకొన్న ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జన్యావుల రామకృష్ణ అన్నారు.అలాగే బోర్డు పరిధిలో గురువారం కంటోన్మెంట్ లోని ఆరో వార్డ్ తిరుమల కాలనిలో పర్యటించిన రామకృష్ణ కాలిని వాసులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని కాలనీ వాసులు తెలుపగా వెంటనే ఇంజనీర్ ,కాంట్రాక్టర్ ను పిలిపించి పరిష్కారం చేయాల్సిందిగా వారు కోరారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రామకృష్ణ.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బిజెపి సీనియర్ నాయకుడు అజయ్ గౌడ్, ప్రతిక్ జైన్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బరువు బాధ్యతలతో కూడిన జీవితమే నిజమైన ఎంజాయ్

- క్రాంతి కళాబృందం గాయకుడు వెంకటాచారి
- సమాజరుగ్మతను రూపుమాపెందుకు ఎంజాయ్ చేద్దాం అనే అవగాహన కార్యక్రమం
- ఈ కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీలు, ప్రజాసంఘాల నేతలు




**జవహర్ నగర్ (ప్రశ్న న్యూస్ )** సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలలో ఒక బాగమైన డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలను విడనాడాలని, కష్టమైన ఇష్టపడి కొనసాగించే బరువు బాధ్యతలతో కూడిన జీవితంలోనే నిజమైన ఎంజాయ్ మెంట్ ఉంటుందని క్రాంతి కళా బృందం వ్యవస్థాపకులు వెంకటాచారి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్, బాలాజీనగర్ లోని బాబు జగ్జీవన్ రావు, అంబేద్కర్ చౌరస్తాలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. క్రాంతి కళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ ముఖ్య అథిదిగా విచ్చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ...పాత సంవత్సరానికి టాటా చెప్పి, 2025 నూతన సంవత్సర శు భాకాంక్షల పేరుతో కొంతమంది విద్యార్థి, యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించి, చేసే దాంట్లో ఎంజాయ్ మెంట్ ఉండదని, వాటిని విసర్జించినప్పుడే ప్రతి మనిషిలో ఆరోగ్యం, ఆనందం వెల్లువిరుస్తాయని అన్నారు. జీవితం అనే ప్రయాణంలో మంచి, చెడులు ఉంటాయని, వాటిలో చెడు అనే వ్యసనాలను వదులుకో గలిగినప్పుడే అహ్లాదకరమైన, అందమైన ఎంజాయ్ మెంట్ జీవితం ఉంటుందనే విషయాన్ని చాటి చెప్పడానికి 'ఎంజాయ్ చేద్దాం' అనే కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. అనంతరం కార్పొరేటర్లు కారింగుల నిహారిక గౌడ్, గొడుగు వేణు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, బీజేపీ రంగుల శంకర్, శ్రామిక మార్గం ఎడిటర్ మోహన్ బైరాగి, రమేష్ చారి, కార్య నిర్వాహకులు జంగిడి శ్రీనివాస్, మంగళంపల్లి తిరుపతి, ఆకవరం బాలు, రుద్రవెల్లి బబ్లు, కోడూరి శ్రావణ్ సింగర్ క్లైమెంట్, ఉమా మహేష్, ఆదర్శ్ వెల్ ఫేర్ మరియు ఎడ్యుకేషనల్ సొసైటీ వృద్ధాశ్రమం నిర్వాహకులు బాల్ రెడ్డి, కవి, రచయిత, అభ్యుదయ పోరాట నాయకులు ఎస్.కె.మీరా, ఐ.ఎఫ్.టి.యు. శివబాబు, ఐ.ఎఫ్.టి.యు.(శ్రామిక స్పందన) షేక్ షావలి తదితరులు పాల్గొని పాట రూపంలో ప్రజలను చైతన్యవంతం చేస్తున్న వెంకటాచారిని అభినందించారు. కళ కళకోసం, అది ప్రజలకోసం అని ఆచరణలో పెట్టిన క్రాంతి కళా బ్రుందాన్ని ప్రశంసించారు. సుమారు మూడు లక్షలపైగా జనాభా కలిగిన స్థానిక జవహర్ నగర్, అత్యంత వెనుకబడిన మురికి వాడ ప్రాంతంగా పిలువబడుతున్న ఏరియాలో గంజాయి ఏరులై పారుతున్నదని అన్నారు. చిన్నపిల్లలు మొదలుకొని పెద్దవారు వరకు దీని బారినపడి జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. గంజాయికి వ్యసనపరులైన కొందరు బలవంతంగా నేరప్రవృత్తిలోకి వెళ్ళిపోయి, అసాంఘిక చర్యలతో ప్రజలను, మహిళలను, వృద్దులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నారని వెల్లడించారు. వీరేగాక, వీరికి చెందిన రక్త సంబంధికులు, బందు, మిత్రులు ఎన్నో అవమానాలను ఎదుర్కొంటున్నారని, పలు మానసిక, శారీరక బాధలను కూడ అనుభవిస్తున్నారని అన్నారు. ఇలాంటి క్రమంలో క్రాంతి కళా బృందం సాహసోపేతంగా గంజాయి పై చేపట్టిన చైతన్య వంతమైన కార్యమాన్ని కొనియాడారు. గంజాయి రహిత జవహర్ నగర్ గా మార్చడానికి క్రాంతి కళా బృందం చేస్తున్న కృషికి, తమవంతు చేయుత ఉంటుందని ప్రకటించారు. భస్తీల వారిగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఇలాంటి మత్తు వ్యసన భూతాలను పారద్రోలడానికి భవిష్యత్ కార్యచరణను రూపొందించుకోవాలని సూచించారు. మనిషి స్వతహగా ఆలోచనపరుడు కాబట్టి, దీనికి మూల కర్తగా నిలిచిన క్రాంతి కళా బ్రుందం భవిష్యత్తులో చేపట్టే మరిన్ని కార్యక్రమాల ద్వారా పరివర్తన చెందగలుగుతాడనే ఆశా ద్రుక్పతాన్ని ప్రకటించారు. సమాజం, సంఘం పట్ల గౌరవ మర్యాదలతో తన సామాజిక భాద్యతను, మనుగడను గుర్తించే మనిషి తత్వా సంస్కృతిని ఎత్తిపట్టిన వెంకటాచారి కృషి, పట్టుదల ఎందరికో స్ఫూర్తిదాయకం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం కవులు, కళాకారులతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ శాలువాలతో సత్కరించారు.

# చదువులకు దూరంగా విద్యార్థినులు

కస్తూర్బా పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుండటంతో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేక విద్యార్థినులు పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుతూ గడుపుతున్నారు. అసలే బాలికల విద్యాలయాలు ఉపాధ్యాయులు లేక వారి కి రక్షణ లేకుండా పోయింది.

ఉపాధ్యాయుల సమ్మెతో మండల కేంద్రాలకు దూరంగా ఉన్న కస్తూర్బా పాఠశాలల పరిస్థితి దారుణంగా మారింది. టెన్త్ విద్యార్థినులకు డిసెంబర్ చివరి నాటికి సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయాల్సి ఉండగా పాఠాలు పూర్తికాక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. మార్చిలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు టైంటేబుల్ ప్రకటించడంతో పాఠా లు పూర్తికాక ఎలా చదువుకోవాలో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు.

### ప్రభుత్వం వెంటనే డిమాండ్లు నెరవేర్చాలి

కొన్నేండ్లుగా సమగ్ర శిక్షా ఉద్యోగులుగా పనిచేస్తున్నాం. మా సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలి. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి పేస్కేల్ ఇవ్వాలి. తొమ్మిది రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతున్నాం.
**క్రాంతికుమార్, సీఆర్పీ , సిద్దిపేట జిల్లా**

**పాఠాలు చెప్పాలేకపోతున్నాం**

కస్తూర్బాలో పని చేస్తున్న ఉపాధ్యాయులు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి.

సిద్దిపేట కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తుండటంతో విద్యార్థినులకు పాఠాలు చెప్పలేకపోతున్నాం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు

# అయ్యప్ప స్వాముల ఆందోళన

**హైదరాబాద్** దిల్సుక్ నగర్ లో ఉన్న నారాయణ హై స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న వశీకరణ్ అనే విద్యార్థిని తరగతి గదిలో మ్యాథ్స్ టీచర్ యూసఫ్ రాజా అనే వ్యక్తి అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థిని నిన్న చితక భాదడంతో గాయాలు అయ్యాయి.
స్కూల్ వద్ద అయ్యప్ప స్వాములు, ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు.స్కూల్ నుండి వెంటనే యూసఫ్ రాజా తొలగించాలని అయ్యప్ప స్వాములకు బహిరంగ;క్షమాపణ చెప్పాలని వారి డిమాండ్ చేస్తున్నారు.చాలా స్కూళ్లలో అయ్యప్ప స్వాములు పై దాడులు చేయడం హేమమైన చర్యని మండిపడ్డారు.యూసఫ్ రాజ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.స్కూల్ లో నన్ను టార్గెట్ చేసి నా పై దాడి చేశారని విద్యార్థి వశీకరణ్ ఆరోపిస్తున్నారు.హిందూ ధర్మం పై కొంతమంది కావాలనే దాడులకు దిగుతున్నారని అలాంటి వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం ఒక జీవో తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## వివాదాలకు అడ్డగా మారుతున్న శ్రీనిధి కళాశాల

**మేడ్చల్** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి యంనంపేటలోనీ శ్రీనిధి కాలేజీ విద్యార్థులు నిరసనకు దిగారు.

ఫీజు రియంబర్స్మెంట్ రాలేదని డబ్బులు చెల్లించాలంటూ కళాశాల యాజమాన్యం. వేధింపులకు గురి చేస్తుందని ఆరోపించారు. ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇష్యూ చేస్తామంటూ చెప్పడంతో నిరసనకు దిగారు. విద్యార్థి సంఘాలు, విద్యార్థులకు సంఘీభావం తెలిపాయి. కళాశాలలో విద్యార్థుల నిరసన కొనసాగుతోంది.

# గుండెపోటుతో రిమాండ్ ఖైదీ మృతి

**జగిత్యాల** జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీ గుండెపోటుతో మృతి చెందాడు. మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన క్యాతం మల్లేశం ఓ కేసులో జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మల్లేశం మృతి చెందాడు. గతంలో మల్లేశంకు ఓపెన్ హార్ట్ సర్జరీ అయిందని అధికారులకు చెప్పినా పట్టించుకోక పోవడంతోనే మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు.

# గుండాయిపేటలో పెద్ద పులి సంచారం

**కొమురంభీం ఆసిఫాబాద్** కౌటాల మండలం గుండాయిపేట్ లో పెద్దపులి సంచారం కలకలం రేపింది. మిరప చేనులో పని చేస్తున్న రైతులకు పెద్దపులి కనిపించడంతో అటవిశాఖ అధికారులకు రైతులు సమాచారం ఇచ్చారు.

పెద్దపులి అడుగులుగా అధికారులు గుర్తించారు. ఒంటరిగా చేనులకు పోవద్దని గ్రామస్తులకు అటవిశాఖ అధికారులు సూచించారు

## అసెంబ్లీని ముట్టడించిన
# మాల మహానాడు నేతలు

**హైదరాబాద్** ఎస్సి వర్గీకరణకు మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరికి నిరసనగా మాల మహానాడు నాయకులు అసెంబ్లీని ముట్టడించారు. అసంబ్లీ ముందు ముఖ్యమంత్రి కు వ్యతిరేకంగా నినాదాలు చేసారు.
మాలమహా నాడు నాయకులు చెన్నయ్య , రామచందర్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసారు. అరెస్ట్ అయిన వారిని కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# కాంగ్రెస్ ఎంపిల అందోళన

**న్యూఢిల్లీ** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా.. కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ వద్ద నిరసనలు చేశారు. కాంగ్రెస్ కూడా అంబేద్కర్ను అవమానించిం దంటూ బీజేపీ నేతలు కూడా ధర్నా ప్రారంభించారు. ఈక్రమంలోనే పార్లమెంటు వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పార్లమెంటులోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కొందరు నేతలను అడ్డుకోవడంతో గొడవ ప్రారంభమైంది. నేతలు ఒకరినొకరు నెట్టేసుకోవడంతో.. ఒడిశాకు చెందిన బీజేపీ ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి మెట్ల పైనుంచి పడిపో యారు. తలకు గాయాలు అయ్యాయి. అయితే రాహుల్ గాంధీ.. ఒక ఎంపీని నెట్టేయగా ఆయన వచ్చి తనపై పడడంతో తాను పడిపోయినట్లు బాధిత ఎంపీ ఆరోపిస్తున్నారు.

## పురుగుల మందు తాగి
# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**కాకినాడ** పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ కొత్తపల్లి మండలం, రమణక్కపేట గ్రామంలో పదవ తరగతి విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. యధావిధిగా స్కూలుకు వెళ్లేందుకు సిద్ధమైన చింతపల్లి నైపుణ్య (16), ఉదయం నిద్ర లేచినప్పటి నుండి తను పనులు తాను బాగానే చేసుకుందని, స్కూల్ కి వెళ్లేందుకు తల్లితో కుమార్తె జడలు కూడా వేయించుకుందని తల్లి చింతపల్లి సుభాషిణి వాపోయింది.
ఇంతలో ఏమైందో ఏమో తెలియడంలేదని, ఇంటి బయట కుమార్తె పడి ఉండడం చూసి ఏం చేయాలో అర్థం కాలేదని కన్నీరు మున్నీరవుతుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాలికను హుటాహుటిన పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు... అక్కడ నుండి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు...

# పెనుగొండ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

**గుంటూరు** ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. దీపిక అభ్యుదయ 'వ్యాస సంపుటి'కి గాను ఆయన ఈ అవార్డు పొందారు. గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తున్న పెనుగొండ 1985-90 మధ్యకాలంలో గుంటూరులో విశాలాంధ్ర విలేకరిగా పనిచేస్తుండగా తాను ఆంధ్రపత్రికలో పనిచేస్తుండే వాడినని, నాటి నుంచి కూడా తనకు ఎంతో సాన్నిహిత్యం వుందని సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా తన ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు.పెనుగొండ వారు తెలుగు సాహిత్యంలో చేసిన కృషికి గాను అజో-విభో కందాళం వారి 'జీవన సాఫల్య పురస్కారం' లభించింది. గతంలో అధికార భాషా సంఘం వారి తెలుగు భాషా పురస్కారం (2003)లో, ప్రజాకవి సుంకర సత్యనారాయణ స్మారక పురస్కారం (2003) లభించాయి. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. 2023లో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా పెనుగొండ గుర్తింపు పొందారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారు. ఆయన తొలి గ్రంథం "అనేక" 2004లో ప్రచురితం కాగా, విదిత 2014లో ప్రచురణయింది. దీపిక 2021లో ప్రచురించారు. దీపికలో పూర్తి సాధికారత కనిపిస్తుంది. 'దీపిక'లో దర్శించిన విషయాలపై వొరప్రసాద్ (సాహితీ స్రవంతి) ఇలా వ్యాఖ్యానించారు. "తొలి, మలితరం తెలుగు కథలు" సంకలనం గురించి దీపిక వివరంగా చర్చించింది. తప్పులకు రుజువులు చూపిస్తూ సరిచేసిన వ్యాసం విలువైన సమాచారం ఇస్తుంది. పివి నరసింహారావు రాసిన 'గొల్ల రామవ్వ' కథను హరితకాంశాల నేపథ్యంలో విశ్లేషించారు. గురజాడ సాహిత్యం - పర్గీకరణలు రాయలును యుగకర్త అనడములోని సాహిత్య కులము బయటపెట్టారు. "వైతాళికులు" సంకలనం వివాదంలో విస్మరణకు గురైన కవితా సంకలనం "కల్పన"ను పాఠకులకు పరిచయం చేశారు.

# తెలంగాణ జనసమితి నిరసన

**హైదరాబాద్** కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ లో అంబేద్కర్ ను అవమానించడాని వ్యతిరేకిస్తూ నాంపల్లిలోని జనసమితి కార్యాలయం ముందు తెలంగాణ జన సమితి నాయకులు , కార్యకర్తలు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసారు.

భారత రాజ్యాంగ బద్దంగా ఎన్నికైన హోంమంత్రి పదవిలోవుండి అంబెడ్కర్ గూర్చి అవమానంగా మాట్లాడడం సిగ్గుచేటు. అగ్రకుల అహంకారం తో అమిత్షా ఈవిధంగా మాట్లాడారని అన్నారు. అంబెడ్కర్ ను అవమానించిన అమిత్షా వెంటనే క్షేమాపన చెప్పాలి. నరేంద్రమోదీ వెంటనే హోంమంత్రి అమిత్షా ను మంత్రి వర్గం నుండి తప్పించాలి. అమిత్ షా భారత ప్రజలకు,అంబెడ్కర్ కు క్షేమాపన చెప్పక్కపోతే తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు

## మరోసారి పెద్ద ఎత్తున గంజాయి చాక్లెట్ గుట్టు రట్టు



**హైదరాబాద్** సైబరాబాద్ ఎస్ ఓటి బాలానగర్ టీం మరోసారి గంజాయి చాక్లెట్ గుట్టు రట్టు చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ ఓ టి బాలానగర్ టీమ్, జగద్గిరి గుట్ట పోలీసులు సంయుక్తంగా జగత్గిరిగుట్ట రింగ్ బస్తీలో కిరాణా దుకాణంపై దాడి చేసి దుకాణం యజమాని బీహార్ కు చెందిన సునీల్ కుమార్ ఝా ను, అదుపులోకి తీసుకుని 61 ప్యాకెట్ల లో ఉన్న 2400 13 కేజీల, గంజాయి చాక్లెట్ల ను స్వాదీనం చేసుకున్నారు.

పట్టుబడ్డ సునీల్ కుమార్ ఝా, 20 సంవత్సరాల క్రితం కూలీ పనుల కోసం బీహార్ నుండి వలస వచ్చినట్లు తెలుస్తుంది. గంజాయి చాక్లెట్ల ను బీహార్ నుండి తెస్తున్నట్లు తెలుస్తుంది. కొన్నేళ్ల క్రితం కిరాణా షాప్ని ప్రారంభించాడు. ఒక్కోచాక్లెట్ 40 లకు వలస కార్మికులకు అమ్ముతునట్లు తెలుస్తుంది. వీటి మొత్తం ధర రూ. 97,600 .

# సమ్మెలో టీచర్లు
## చదువుకు దూరంగా విద్యార్థినులు..!

**సిద్దిపేట** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 22 కస్తూర్బా పాఠశాలలు, ఏడు జూనియర్ కళాశాలలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కస్తూర్బా పాఠశాల ల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బాపాఠశాలల ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సత్వరమే తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఉపాధ్యాయు లు కోరుతున్నారు. తొమ్మిది రోజులుగా ఉపాధ్యాయులు సమ్మెలో ఉండగా పాఠాలు చెప్పే వారు లేక విద్యార్థినులు ఆట,పాటలతో గడుపుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థినులకు రక్షణగా ఉపాధ్యాయులు లేక విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లాలోని పాఠశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఈ నెల మొదటి వారంలో సంబంధిత అధికారులకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. జిల్లాలో 22 కస్తూర్బా, ఏడు కస్తూర్బా జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ప్రత్యేకాధికారులు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీలు, ఏఎన్ఏంలు, సిబ్బంది తొమ్మిది రోజులుగా సమ్మె బాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 22కస్తూర్బా పాఠశాలల్లో 4500, ఏడు జూనియర్ కళాశాలల్లో సుమారు 2500మంది విద్యార్థినులు ఉన్నారు. కస్తూర్బా పాఠశాలలో 310 మంది వర కు ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల్లో 140 మంది పీజీసీఆర్టీ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరి సమ్మెకు రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంఘీభావం ప్రకటించారు.

# సంపాదకీయం

## కరిగిపోతున్న అంబానీ, ఆదానీల ఆదాయం

భారత కుబేరుల సంపద సన్నగిల్లుతోంది. అంబానీ, అదానీల నికర సంపదలో డౌన్‌ఫాల్ మొదలయ్యింది. కొంతకాలంగా భారత స్టాక్ మార్కెట్ సూచీలు పతనం అవుతుండగా? దిగ్గజ కంపెనీలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ స్టాక్స్ పెద్ద మొత్తంలో పడిపోతున్నాయి. ఈ క్రమంలో దిగ్గజ పారిశ్రామిక వేత్తల నికర సంపద భారీగా తగ్గుతోంది. భారతదేశంలో అత్యంత సంపన్నుల జాబితాలో అగ్ర స్థానంలో నిలవడమే గాక, ఆసియాలోనే ధనికులుగా గుర్తింపు పొందినవారు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ. కొద్ది నెలల క్రితం నికర ఆదాయం భారీగా పెరిగిన వీరు, ఇప్పుడు మాత్రం బ్లూమ్ బర్గ్ 100 బిలియన్ డాలర్ల క్లబ్ లో చోటు దక్కించుకోలేకపోయారు. వారి వ్యాపారాలతోపాటు వ్యక్తిగత సంపద విషయంలోనూ ఇద్దరూ సవాళ్లు ఎదుర్కోవడం వల్లే ఈ క్లబ్ నుంచి బయటకు రావాల్సి వచ్చిందని తాజాగా విడుదలైన 'బ్లూమ్‌బర్గ్' నివేదిక పేర్కొంది.అంబానీ ఎనర్జీ, రిటైల్ వ్యాపారాల ప్రదర్శన అనుకున్నంతగా లేకపోవడం కూడా ఈ క్లబ్ నుంచి బయటకు రావడానికి ఒక కారణమని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది.

ఇప్పుడు, ప్రపంచ కుబేరుల జాబితాలో టాప్-10లో ఇద్దరిలో ఏ ఒక్కరూ లేకపోవడం గమనార్హం. సెప్టెంబరు 2022లో గౌతమ్ అదానీ.. ప్రపంచంలోనే రెండవ అత్యంత సంపన్న వ్యక్తిగా ఉండగా.. ఇప్పుడు 19వ స్థానానికి పడిపోయారు. ముఖేష్ అంబానీ 17వ స్థానానికి పరిమితమయ్యారు. తాజాగా.. ఇద్దరి సంపద 100 బిలియన్ డాలర్ల మార్క్ దిగువకు చేరినట్లు బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ నివేదిక వెల్లడించింది.జులైలో, తన కుమారుడు అనంత్ అంబానీ పెళ్లి సమయంలో అంబానీ సంపద దాదాపు 120.8 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత కరెన్సీలో ఇది రూ. 10.25 లక్షల కోట్లు. అదే సమయంలో అంబానీ కుమారుడు వివాహానికి దాదాపుగా 600 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. అంబానీ ఇటీవల డిజిటల్ ప్లాట్‌ఫాంలు, రిటైల్ బ్రాండ్లపై దృష్టి సారించారు. రిటైల్ వ్యాపారంలో ఇటీవల వృద్ధి, లాభాలు మందగించాయి. ఇక, కేసులతో కొత్త చిక్కులు ఎదుర్కుంటున్నఅదానీ కూడా డౌన్‌ఫాల్‌ను ఎదుర్కుంటున్నారు.సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందడం కోసం భారతీయ అధికారులకు ముడుపులు ఇచ్చిన వ్యవహారంలో అమెరికాలో కేసు నమోదైన తర్వాత అదానీ సంపదలో క్షీణత మొదలైంది. జూన్‌లో అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్లకు చేరుకోగా.. అమెరికాలో ఆరోపణలు, కేసులు.. అంతకుముందు హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ సామ్రాజ్యానికి సవాళ్లు ఎదురయ్యాయి. ఫలితంగా అదాని సంపద 100 బిలియన్ డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. బ్లూమ్ బర్గ్ నివేదిక ప్రకారం, ప్రస్తుతం ముకేశ్ అంబానీ సంపద 96.3 బిలియన్ డాలర్లు కాగా? గౌతం అదానీ సంపద 80.8 బిలయన్ డాలర్లుగా ఉంది.ఇక, రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థలోని ప్రధాన వ్యాపారాలైన రిటైల్, ఇంధన రంగాలు ఇటీవల మెరుగైన పనితీరు కనబర్చకపోవడమే ముఖేష్ అంబాని పరిస్థితికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. చమురు, రసాయన విభాగంలో డిమాండ్ తగ్గడం, రిటైల్ వినియోగదారుల వ్యయాలు తగ్గడం, చైనా ఎగుమతుల నుంచి పోటీ వంటివి అంబాని సంపదకు ఎసరు పెట్టాయి. ఈ క్రమంలో, కంపెనీకి పెరుగుతున్న అప్పులపైనా ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. రిలయన్స్ షేర్లు తగ్గుతూ వచ్చింది. అలాగే, ఇటీవల మీడియా, ఏఐ కంప్యూటింగ్‌లో ఆధిపత్యం కోసం అంబానీ పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టడం కూడా సంపద డౌన్‌ఫాల్‌కు కారణమయ్యింది.మరోవైపు, గౌతమ్ అదానీ సంపద గత కొన్నేళ్లుగా తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతోంది. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్ వెలువడగా.. గరిష్ట స్థాయిల నుంచి సంపద భారీగా తగ్గింది. మధ్యలో మళ్లీ పుంజుకున్నప్పటికీ.. ఇటీవల వరుస ఆరోపణలు, దర్యాప్తులతో మళ్లీ షేర్లపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు వచ్చే ఏడాది కూడా ఆ సంస్థ మార్కెట్ విలువపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. అయితే, గతంలోలాగా మళ్లీ మదుపరుల విశ్వాసం పొందేతే తప్ప ఈ ఇద్దరు కుబేరులు కష్ట కాలం నుండి బయటపడే అవకాశం ఉంది.గౌతం అదానీ, ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద నష్టపోయినప్పటికీ? భారతదేశంలోని టాప్-20 బిలియనీర్ల సంపద 2024 జనవరి నుంచి 67.3 బిలియన్ డాలర్లు వృద్ధి చెందినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఊఅట టెక్నాలజీ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ 10.8 బిలియన్ డాలర్లు, ఉక్కు పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ 10.1 బిలియన్ డాలర్ల సంపద పెంచుకున్నారు.మరోవైపు, ఎలన్ మస్క్ కంపెనీ స్టార్ లింక్ భారత్‌లో ఎంట్రీ ఇవ్వడానికి రంగం సిద్ధమైనట్లు కనిపిస్తోంది. దీనితో, స్టార్ లింక్, భారత్‌లో శాటిలైట్ ఆధారిత వాయిస్, డేటా కమ్యూనికేషన్ వంటి సేవలు ప్రారంభిస్తే.. ఎయిర్‌టెల్‌తో పాటు అంబానీ సంస్థ జియో కూడా గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇది, అంబానీ సంపదకు మరో సవాలుగా మారే ఛాన్స్ ఉంది. అంబానీ తిరిగి నిలదొక్కుకోడానికి చేస్తున్న ఈ వ్యూహాలు దీర్ఘకాలిక వృద్ధి సామర్థ్యాన్ని సూచిస్తున్నాయి.తాజా గ్లోబల్, డొమెస్టిక్ సవాళ్లకు కొత్తగా అమెరికా గద్దెనెక్కబోతున్న ట్రంప్ ప్రెసిడెన్సీ కూడా ఒక రకంగా కారణమేనని కొందరు వాదిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌కి తిరిగి ఎన్నికైన తర్వాత భారతీయ ఎగుమతులపై కొత్త ట్యాక్స్‌లను మోపుతున్నారు. దీని వల్ల భారతీయ వ్యాపారాలకు సంభావ్య వాణిజ్య సవాళ్లు ఎదురవుతాయనే భయం కూడా అందరిలో కనిపిస్తోంది.

అయితే, దీని ప్రభావం ఇప్పటికే కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్ విధించిన సుంకాలతో భారతదేశ ఎగుమతులు పోటీలో నిలదొక్కుకోలేవని అంటున్నారు.ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ? దేశంలో అభివృద్ధి చెందుతున్న మధ్యతరగతికి అవకాశాలను అందిస్తూనే ఉండటాన్ని మంచి పరిణామంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## అదుపుతప్పి యాష్ ట్యాంకర్ బోల్తా..



**జూలూరుపాడు :** జూలూరుపాడు లోని సీతారామ కార్యాలయ సమీపంలో గురువారం తెల్లవారుజామున యాష్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో సూర్యాపేట జిల్లా మటన్ పల్లి మండలం బొజ్జ తండా గ్రామానికి చెందిన ఎస్ శివకు గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే మణుగూరులోని బీటీపీఎస్ లో ట్యాంకర్ లో యాష్ లోడ్ చేసుకుని దిగుమతి చేసేందుకు జాన్ పాడు వెళుతున్నాడు. ఈ క్రమంలో జూలూరుపాడులోని సీతారామ కార్యాలయ సమీపంలో ఎదురుగా వెళుతున్న కారును తప్పించబోయి ట్యాంకర్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న పొలంలో బోల్తా పడింది. లారీ డ్రైవర్ శివ క్యాబిన్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయాడు. దీంతో సంఘటనా స్థలానికి స్థానిక పోలీసులు, కొత్తగూడెం ఫైర్ రెస్క్యూ సిబ్బంది చేరుకుని డ్రైవర్ను బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. రెండు గంటలపాటు తీవ్రంగా శ్రమించి క్రేన్, జేసీబీ సహాయంతో స్థానికులతో కలిసి వారు డ్రైవర్ ను బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. ఈ సంఘటనలో డ్రైవర్ కాళ్లు విరిగాయి. అతనికి వైద్య చికిత్సలు అందించేందుకు 108లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు.

## కారులో వివాహిత ఆత్మహత్య



**రంగారెడ్డి** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దారుణం జరిగింది. సాగర్ హైవే లోని ఇంజాపూర్ రాజశ్రీ ఎన్ క్లేవ్ రామకృష్ణారెడ్డి ఉమాశ్రీ దంపతులు నివాసం ఉంటున్నారు బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో బయటికి వచ్చిన తను కారులో కూర్చొని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది కారులో ఆమని గ్రహించిన సోదరుడు ప్రైవేట్ హాస్పిటల్ తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## చిట్కుల్‌లో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్

**సంగారెడ్డి** పటాన్ చెరు మండల్ చిట్కుల్ గ్రామ పంచాయతీ పరిధిలో వడ్డెర బస్తీలో ఎస్పీ ఆదేశాల మేరకు డి.ఎస్.పి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 10 టాటా ఏసీలు, 70 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు సరైన పత్రాలు లేకుండా ఉన్న వాటిని సీజ్ చేశామని వాటిని పూర్తిస్థాయిలో విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని పటాన్ చెరు డి.ఎస్.పి రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్డెన్ సెర్చ్ లో 8 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, వందమంది కానిస్టేబుళ్లు హాజరయ్యి స్థానిక ప్రజలకు నేరాలపై అవగాహన కల్పించారు.

## మహిళ దారుణహత్య




**తిరుపతి** అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సింగాల గుంటలో మహిళ దారుణ హత్యకు గురయింది. మృతురాలు దాక్షాయిని (55). సింగాలగుంటలో నివాసముంటున్న తన, అక్క బావ గొడవలకు బావ తల్లి కారణమని విజయకృష్ణ అర్ధరాత్రి కత్తితో దాడిచేసాడు. గాయపడిన దాక్షాయిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న అలిపిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. దాక్షాయిని బంధువుల ఫిర్యాదు మేరకు అలిపిరి సిఐ రామకిషోర్ కేసు నమోదు చేసారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్

**- వాహనదారులు బెంబేలు**




**నిడదవోలు** జాతీయ రహదారి విజయవాడ వైపు మద్యం మత్తులో డ్రైవర్ మితిమీరిన వేగంతో కారు నడుపుతు హైవేలో హల్చల్ చేసాడు. దాంతో రోడ్డు మీదున్న వాహనదారులు బెంబేలు ఎత్తిపోయారు. జడ్పీటీసీ నిడదవోలు మండలం అనే స్టికర్ గల వాహనం రు నడిపే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరికైనా ప్రమాదం జరిగితే ఏమిటి పరిస్థితి..? అని ప్రశ్నిస్తున్నారు. షిఫ్ట్ కారు విజయవాడ వైపు పయనం చేసింది

## 30 కోట్లతో రంపచోడవరం నియోజకవర్గ మన్యం రోడ్లకు మహర్ధశ

**- ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి**

**రంపచోడవరం** రంప ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి గురువారం నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో మొదటిసారిగా పర్యటించారు. మొదటి సారి ఎమ్మెల్యే అయినా అసెంబ్లీలో ఏజెన్సీ గిరిజనుల కష్టాలు, బాధలు చెప్పడమే కాకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అతికొద్ది కాలంలోనే రంపచోడవరం నియోజకవర్గ రోడ్లు, ఇతర సమస్యల ప్రభుత్వానికి నివేదికలు తయారు చేసి, అందించారు ఎమ్మెల్యే. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం రంపచోడవరం నియోజకవర్గానికి తొలి విడతగా 30 కోట్ల రూపాయలతో ఏడు రోడ్లు మంజూరయ్యాయి.రోడ్ల శంకుస్థాపన కోసం మారుమూల అటవీ ప్రాంతంలోకి వెళ్లి సరైన రోడ్డు మార్గం లేకున్నా నడిచి కలువలు, గుట్టలు దాటి శంకుస్థాపన చేశారు ఎమ్మెల్యే శిరీష . గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## కెనడాలో గాజువాక యువకుడు అనుమానస్పద మృతి



**విశాఖపట్నం** ఉన్నత చదువులు కోసం కెనడా కి వెళ్ళిన విశాఖ యువకుడు అక్కడ మృతి చెందాడు. ఫణికుమర్ (33) హాస్టల్ లో నిద్రిస్తూ అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. నిద్రలో గుండె పోటుతో యువకుడు మృతి చెందాడు అని ఫణికుమర్ మిత్రుల తల్లిదండ్రులు కి ఫోన్ చేసి చెప్పారు. శోకసంద్రంలో ఫణికుమర్ తల్లిదండ్రులు మునిగిపోయారు. మా అబ్బాయిని ఇండియాకి తీసుకురావాలని తల్లిదండ్రుల అధికారులనె కోరుతున్నారు.

## కరీంనగర్‌లో కాంగ్రెస్ ఆందోళన

**- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దిష్టిబొమ్మ దగ్ధం**
**- అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులు**
**- పోలీసులకు కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట**
**- కానిస్టేబుల్‌కు స్వల్ప గాయం**

**కరీంనగర్** కరీంనగర్ లో కాంగ్రెస్ ఆందోళన స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన ఆందోళనకు దిగారు.కరీంనగర్లో గంగుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దిష్టిబొమ్మ దహనం చేయకుండా అడ్డుకునేందుకు పోలీసులు యత్నించగా పోలీసులకు కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. తోపులాటలో కానిస్టేబుల్ కు స్వల్ప గాయమైంది. దిష్టిబొమ్మ చినిగి పోయింది. ముక్కలైన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు కాంగ్రెస్ కార్యకర్తలు. గంగులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పొన్నం ప్రభాకర్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పెద్దాపురం గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ సత్యప్రసాద్

**జగిత్యాల** జిల్లాలోని పెద్దాపురం గురుకుల పాఠశాలను కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. గురుకులంలో పాము కనిపించలేదని విద్యార్థులు చెబుతున్నారు. గురుకులంలో గదుల్లోకి పాములు వచ్చే అవకాశం లేదని కలెక్టర్ స్పష్టం చేసారు. నిన్న ఆసుపత్రిలో చేరిన అఖిల్ కు పాము కాటు అని అనుమానమే తప్ప నిర్ధారణ కాలేదని వెల్లడించారు. అఖిల్ పక్కనే ఉన్న మరో విద్యార్థి యశ్వంత్ భయంతో ఆసుపత్రిలో చేరాడని వెల్లడించారు. ఇద్దరు విద్యార్థులు ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని... ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. పాములు పురుగులు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాం. ఇంకా చిన్నచిన్న గ్యాబ్ లు ఏమైనా ఉంటే ఈరోజు సాయంత్రంలోగా పూడ్చివేస్తామని అన్నారు.

## పెద్దాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మాధవిలత సస్పెన్షన్

**జగిత్యాల** పెద్దాపురం గురుకుం పాఠశాత ప్రిన్సిపల్ మాధవిలత పై సస్పెన్షన్ వేటు పడింది. బుధవారం ఆమె లీవ్ లో ఉన్నారు. ఇద్దరు విద్యార్థులు పాము కాటుకు గురి ఆసుపత్రిలో చేరిన వినషమయం తెలిసిందే. కోరుట్ల ఆసుపత్రిలో ఇద్దరు విద్యార్థులు అఖిల్, యశ్వంత్ కోలుకుంటున్నారు. గురుకులంను, ఆసుపత్రిని సందర్శించి కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రిన్సిపల్ మాధవి లత ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.

## కుటుంబం ఆత్మహత్యాయత్నం

**సూర్యాపేట** తుంగతుర్తి మండలం, రావులపల్లి గ్రామంలో 70 సంవత్సరాల క్రితం రైతులు వెళుతున్న కాలిబాట, పంట కాలువలను గ్రామానికి కొందరు తొలగించారంటూ బాధిత రైతు కుటుంబం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేశారు. విచారణకు వెళ్లిన తుంగతుర్తి పోలీసుల ఎదుట ఏకంగా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రావులపల్లి గ్రామంలో.. 70 సంవత్సరాల నుండి కొంతమంది రైతులు ఒక ప్రక్క బాటను, మరొక ప్రక్క కాలువతో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో బాట, కాల్వపై పెద్దమనుషులు కన్నెర్ర చేసి.. ఏకంగా ప్రజావాణికి వెళ్లి బాట లేనట్లుగా అధికారులను పక్కదోవ పట్టించారు. అయితే.. గతంలో ఇక్కడకాలి బాట ఉన్నట్టు అధికారులే పేర్కొనడం గమనార్హం. జరిగిన సంఘటనపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధిత రైతుల కుటుంబాలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కేవీపీఎస్ కార్యకర్తల అందోళన

**నల్గొండ** భారతదేశ పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. మాట్లాడిన విధానంపై సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. తాజాగా.. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పైన చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరశిస్తూ.. నల్లగొండ పట్టణంలోని సుభాష్ సెంటర్ లో.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మ దహనం చేశారు కేవీపీఎస్ నాయకులు. తక్షణమే కేంద్ర హోం మంత్రి క్షమాపణ చెప్పాలంటూ వాళ్లు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వాసుపత్రిలో కార్మికుల అందోళన

**నల్గొండ** నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో కార్మికులు ఆందోళనకు దిగారు. కాంట్రాక్టర్లు, సూపర్ వైజర్ల వేదింపులకు నిరసనగా.. విధులు బహిష్కరించిన ధర్నా చేశారు. రాత్రివేళల్లో అటెండెన్స్ పేరుతో వేదింపులకు గురిచేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమపై నిత్యం దురుసుగా ప్రవర్తిస్తున్నారని.. ప్రశ్నిస్తే పనిలో నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్టు బాధిత కార్మికులు ఆరోపణలు చేస్తున్నారు.

ఇక..గత రాత్రి తాగి వచ్చి ఫోటోలు తీస్తూ వేదింపులకు గురిచేయడంతో.. ఓ కార్మికులకు భయంతో అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలైంది. వేదింపులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్లు, సూపర్ వైజర్లపై చర్యలు తీసుకోవాలని కార్మికులుడిమాండ్ చేస్తున్నారు. ఇక కార్మికుల ధర్నా నేపథ్యంలో.. ఆస్పత్రిలో కాసేపు వైద్య సేవలకు ఆటంకం కలిగింది.

## సర్వేల్ గురుకులం ముందు బీజేపీ బీఆర్ఎస్ అందోళన

**నల్గొండ** సంస్థాన్ నారాయణపురం మండలనీ, సర్వేల్ గురుకుల పాఠశాల బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ధర్నాకు దిగారు. విద్యార్థుల చేత వంట పాత్రలు ఊహిస్తున్నారని.. ఆ క్రమంలోనే రాగి జావా గిన్నె జారిపడి విద్యార్థి కాలికి తీవ్ర గాయాలు అయ్యాయంటూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ. తక్షణమే గురుకుల ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు.

## పార్లమెంటు ఆవరణలో గందరగోళం

**- పార్లమెంటు లోపలికి వెళ్తున్న ఎంపిలను అడ్డుకొన్న విపక్ష సభ్యులు**
**- తోపులాటలో గాయపడ్డ ఒడిశా బిజెపి ఎంపి ప్రతాప్ సింగ్ సారంగి**



**న్యూ ఢిల్లీ :** పార్లమెంటు ఆవరణలో గందరగోళం నెలకొంది. డా బిఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోంశాఖ అమిత్ షా అవమానించరంటూ విపక్ష సభ్యులు నిరసన తెలిపారు. అధికార, విపక్ష సభ్యులు పోటాపోటీగా నిరసన తెలియజేశారు.

ఇరుపక్షాల నిరసనలతో పార్లమెంటు ప్రాంగణం హోరెత్తింది. అంబేద్కర్‌ను అవమానించరంటూ పరస్పరం విమర్శలు చేసుకున్నారు. పార్లమెంటు లోపలికి వెళ్తున్న ఎంపిలను విపక్ష సభ్యులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఒడిశా బిజెపి ఎంపి ప్రతాప్ సింగ్ సారంగి గాయపడ్డారు. స్వల్పంగా గాయపడిన ఎంపిని ఆస్పత్రికి తరలించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధే నెట్టారని అధికార పక్ష సభ్యులు ఆరోపిస్తున్నారు.

# జగన్‌కు దూరమౌతున్న కాపు వర్గం

**విజయవాడ :** ఏపీలో అతి బలమైన ఓటు బ్యాంకు ఉన్న కాపు సామాజిక వర్గం వైసీపీ అధినేత జగన్‌ను వదిలి పెడుతోందా..? ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ఈ చర్చ ఎక్కువగా జరుగుతోంది. ఆ మధ్య ఒకేసారి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీనామా చేయడంతో ఈ చర్చ మరింత ఎక్కువైంది. 2024 ఎన్నికల్లో వైసిపి ఓటమి చెందిన తర్వాత కాపు సామాజిక వర్గ నేతలు వరుసగా ఆ పార్టీకి దూరం అవుతున్నారు. ముందుగా కిలారు రోశయ్య, సామినేని ఉదయభాను లాంటి నేతలు పార్టీకి రాజీనామా చేస్తే ఆ తర్వాత జగన్‌కు అత్యంత నమ్మకమైన స్నేహితుడిగా ఉన్న ఆళ్లనాని కూడా పార్టీకి రాజీనామా చేశారు. ఇది వైసిపినే కాకుండా రాష్ట్ర రాజకీయాలను కూడా షాక్‌కు గురి చేసింది. నిజానికి తొలి విడతలోనే ఆళ్ల నానిని మంత్రిని చేశారు జగన్మోహన్ రెడ్డి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో మంత్రి పదవి కోల్పోయినప్పుడు నుంచి ఆయన ముభావంగానే ఉంటూ వచ్చారు. పార్టీ అధికారం కోల్పోగానే జగన్‌కు బై బై చెప్పేశారు. భీమవరంలో గ్రంధి శ్రీనివాస్‌ది కూడా అదే దారి. ఏకంగా 2019లో జనసేన అధినేత పవన్‌ను ఓడించి జయింట్ కిల్లర్‌గా పేరుపొందిన గ్రంధి శ్రీనివాస్‌కు కనీసం రెండో విడతలోనన్నా మంత్రి పదవి గ్యారెంటీ అని భావించారు. కానీ పలు సమీకరణల దృష్ట్యా జగన్ ఆయనపై దృష్టి పెట్టలేదు. దీనితో తనకు సరైన గుర్తింపు దక్కలేదని ఎప్పటినుంచో భావిస్తున్న గ్రంధి శ్రీనివాస్ ఎన్నికల తర్వాత పార్టీని వదిలేసారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అటు వైపు వెళ్ళిపోతారన్న విమర్శలు ఎదుర్కొనే అవంతి శ్రీనివాస్ కూడా వైసిపి నుంచి బయటికి వచ్చేసారు. జగన్ హయంలో ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతానికి వీరు మాత్రమే కాకుండా మరికొందరు కాపు నేతలు కూడా వైసీపీని వీడే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో జనసేన కాపులను, కాపులు జనసేన ను ఓన్ చేసుకుంటున్నారు. పవన్‌ను ఒక సీరియస్ పొలిటిషన్‌గా వారు గుర్తించడానికి కొంత టైం పట్టింది. ఎప్పటికైనా ఏపీలో కాపు సామాజిక వర్గం నుంచి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్న వ్యక్తిగా పవన్ని చూస్తున్నారు.

దాని ఫలితమే 2024 ఎన్నికల్లో జనసేన సాధించిన 100% విజయం. ఇలాంటి పరిస్థితుల్లో వేరే పార్టీల్లో ఉండటం కన్నా జనసేనకు షిఫ్ట్ కావడమే మంచిదనే ఆలోచనలో కాపు సామాజిక వర్గానికి చెందిన నేతలు భావిస్తున్నారు. వీలైతే జనసేన లోనికో లేకుంటే కనీసం కూటమిలోని ఇతర పార్టీల్లోకో వెళ్లడం ప్రస్తుతానికి బెటరనే ఆలోచనలు వీళ్లు ఉన్నారు.విజయవాడ నుంచి ఉత్తరాంధ్ర వరకు కాపు సామాజిక వర్గం దాని అనుబంధ కులాల లీడర్లు ఎక్కువగా ఉన్నారు. ఓటర్లపరంగా కూడా వారి ప్రభావం ఈ ప్రాంతాల్లో ఉంటుంది.

వైసీపీలో ఆ ప్రాంతాలకు సంబంధం లేని రెడ్డి లీడర్లు సలహాదారుల పేరుతో పెత్తనం సాగించడం చాలా మందికి నచ్చడం లేదు. జగన్‌కు తమకు మధ్య అడ్డుకట్టలా వాళ్లు మారిపోతున్నరని అసహనానికి లోనవుతున్నారు. దానికి తోడు జగన్ కూడా క్షేత్ర స్థాయి పరిస్థితులను లెక్క లోకి తీసుకోకుండా తోచినట్టు చేసుకుపోతున్నారనే ఆరోపణ ఉంది. ఇక తమ సామాజిక వర్గానికి చెందిన పవన్‌ను తమ తోనే తిట్టిస్తూ రావడం వల్ల ఓటు బ్యాంకు పూర్తిగా దెబ్బతింటుందని భావించిన కాపు లీడర్లు వైసీపీకి బై బై చెప్తున్నారు. మరి రానున్న రోజుల్లో ఇంకెంత మంది కాపు లీడర్లు బయటకు వస్తారో జగన్ వారికి ఎలా అడ్డుకట్ట వేస్తారో చూడాలి.

# దొంగతనం అంత ఈజీనా...

**కాకినాడ :** సులువుగా డబ్బులు ఎలా సంపాదించాలి అని వీడియోలు చూశాడో.. లేకపోతే దొంగతనం కేంద్రంసాగే మనీ హెయిస్ట్ లాంటి వెబ్ సిరీస్‌లు చూశాడో కానీ ఓ వ్యక్తి ఏకంగా ఓ కార్పొరేట్ గోల్డ్ షోరూంనే టార్గెట్ చేశాడు. కానీ ప్రాపర్ గా వర్కవుట్ చేయకపోవడం.. దోచుకున్న వరకే ప్లాన్ రెడీ చేసుకోవడం.. ఆ ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో తెలియకపోవడంతో దొరికిపోయాడు. అది కూడా మామూలు పోలీసులకు కాదు.. ట్రాఫిక్ పోలీసులకు. కాకినాడ మెయిన్ రోడ్‌లో తనిష్క్ బంగారు ఆభరణాల షోరూం ఉంది.

మధ్యాహ్నం సమయంలో కస్టమర్లు ఎవరూ లేరు. ఆ సమయలో ఓ యువకుడు వచ్చాడు. తనకు లావుపాటి గోల్డ్ చైన్ కావాలని చూపించమని అడిగాడు. సేల్స్ గర్ల్ ఆరేడు మోడల్స్ చూపించింది. అన్నింటిని తన చేతుల్లోకి తీసుకున్న ఆ వ్యక్తి వెంటనే జేబులో నుంచి తుపాకీ తీసి.. కదిలితే కాల్చేస్తానని హెచ్చరించాడు.దాంతో వచ్చిన వాడు దొంగ అని తెలిసి ఆ సేల్స్ గర్ల్ వణికిపోయింది. తర్వాత అతను ఆ నగలు తీసుకుని పరారయ్యాడు. చేతిలోతుపాకీ కూడా ఉండటంతో సెక్యూరిటీ కూడా ఆపలేదు. ఆ దొంగ అలా రోడ్డు మీదకు పరుగులు పెట్టిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే సిటీ బయటకు అనుమానాస్పద వ్యక్తులు వెళ్లకుండా తనిఖీలు చేయమని ఆదేశాలిచ్చి షోరూంను పరిశీలించేందుకు వచ్చారు. అయితే కాసేపటికే ఫారెస్ట్ ఆపీసు దగ్గర ఓ యువకుడ్ని పోలీసులు పట్టుకున్నారని అతని వద్ద చాలా బంగారు ఆభరణాలు ఉన్నాయని కంట్రోల్ రూమ్ కు ఫోన్ వచ్చింది. వెంటనే వెళ్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి తుపాకీ చూపించి గోల్డ్ కొట్టేసి బయటకు వచ్చాడు కానీ.. ఎటు పోవాలో అర్థం కాలేదు. ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్ దగ్గర అనుమానాస్పదంగా ప్రవర్తిస్తూండటంతో ఏమైందని ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రశ్నించాడు. అప్పటికే దొంగతనం చేశానన్న ఆందోళనతో.. ?ందరూ తననే వెంటాడుతున్నారన్న భయంతో వణికిపోతున్న ఆ యువకుడు పారిపోయే ప్రయత్నం చేశాడు. తేడాగా ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు అతడిని పట్టుకున్నాడు. అతని జేబుల్లో వెదికితే బంగారం లభించింది. వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న గన్ స్వాధీనం చేసుకున్నారు. అది నిజమైన గన్ కాదని.. టాయ్ గన్ అని తేలింది. ఆ యువకుడ్ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అతను ప్రొఫెషనల్ దొంగ కాదని.. అలా అయితే.. పకడ్బందీగా దోపిడీ చేసి పారిపోయేందుకు కూడా ఏర్పాట్లు చేసుకుని ఉండేవాడని పోలీసులు భావిస్తున్నారు.

# జనం జేబులకు టోల్ చిల్లు

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్‌లో టోల్ ఫీజులు జనం జేబులకు చిల్లు పెడుతున్నాయి. కొత్త నిబంధనలు అమల్లోకి రావడంతో సింగల్ ఎంట్రీ ఫీజులను వసూలు చేస్తున్నారు. దీంతో జనంపై భారీగా భారం పడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపె 65టోల్ గేట్లలో ఇదే రకమైన వసూళ్లు అమలవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ టోల్ ప్లాజాలలో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫాస్ట్ ట్యాగ్ వినియోగంతో జనానికి అప్పటికప్పుడు ఎంత కోత పడుతుందో తెలియకపోయినా టోల్ వసూళ్లు లెక్క బయటపడేసరికి జనం గగ్గోలు పెడుతున్నారు. ప్రతి టోల్ గేట్ వద్ద సింగల్ ఎంట్రీని మాత్రమే అనుమతిస్తున్నారు.

ప్రిపెయిడ్ తరహాలో ఫాస్ట్ ట్యాగ్‌లను వినియోగిస్తుండటంతో టోల్ ఫీజు ఎంత వసూలు చేస్తున్నారో వాహనాలకు అప్పటికప్పుడు తెలియడం లేదు.గత కొన్ని వారాలుగా ఒక రోజులో ఎన్నిసార్లు జాతీయ రహదారుల మీదుగా టోల్ ప్లాజాలను క్రాస్? చేస్తే అన్నిసార్లూ విడివిడిగా టోల్ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. విజయవాడ- గుంటూరు మధ్య జాతీయ రహదారిపై పెదకాకాని- కాజా వద్ద ఉన్న టోల్ ప్లాజాలో ఒక్కసారి ప్రయాణిస్తే రూ.160 ఛార్జీ వసూలు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో 24గంటల్లోపు అందులో సగమే వసూలు చేసేవారు.బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో నిర్మించిన జాతీయ రహదారుల గడువు ముగియడంతో కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. దీంతో అయా రహదారులపై వాహనం ఎన్నిసార్లు ప్రయాణిస్తే అన్నిసార్లు టోల్ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. రాష్ట్రంలోని 65 టోల్ ప్లాజాలల్లో ఇదే పరిస్థితి ఉంది. వీటి నిర్మాణం, బీవోటీ గడువు ముగియడంతో అక్టోబరు నుంచి కొత్త నిబంధలన ప్రకారం టోల్ వసూలు చేస్తున్నారు.సెప్టెంబరు నెల వరకు జాతీయ రహదారులపై ప్రయాణించే కార్లకు ఒకవైపు ప్రయాణానికి రూ. 160 తిరుగు ప్రయాణంలో రూ.80 చెల్లిస్తే సరిపోయేది. 24 గంటల వ్యవధిలో ఆ కారు ప్రత్యేకంగా టోల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదు. అక్టోబరు నుంచి అమలులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనల ప్రకారం ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లూ మొదటి వైపు ప్రయాణానికి ఒకవైపు పూర్తి ఫీజుతో పాటు రెండోసారి సగం ఫీజు చొప్పున వసూలు చేస్తున్నారు.విజయవాడ-గుంటూరు మధ్య నిత్యం వేల సంఖ్యలో ఉద్యోగులు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు.

తాజా నిబంధనతో వారిపై టోల్ రూపంలో తీవ్ర భారం పడుతోంది. టోల్ ఫీజుల మార్పులు గురించి ఎలాంటి ప్రకటన విడుదల చేయకుండా ఫాస్టటాగ్‌లో వసూలు చేయడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ప్రజల నుంచి అడ్డగోలుగా టోల్ ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని జాతీయ రహదారులపై మొత్తం 69 టోల్ ప్లాజాలు ఉన్నాయి. 65 టోల్ ప్లాజాల్లో కొత్త నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేస్తున్నారు. విజయవాడ-హైదరాబాద్ మార్గంలోని తీసర టోల్ ప్లాజాను కొద్ది కాలం క్రితమే జిఎంఆర్ నిర్మాణం చేపట్టింది.

నెల్లూరు-చెన్నై హైవేలో ఉన్న వెంకటాచలం, బూదరం, సూళ్లూరుపేట కలిపి మొత్తం 4 చోట్ల మాత్రమే పాత విధానంలో వాహనాలకు టోల్ వసూలు చేస్తున్నట్టు ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు.నాలుగు టోల్ ప్లాజాల్లో 24 గంటల్లోపు ఎన్ని సార్లు రాకపోకలు సాగించినా.. ఒకసారి పూర్తిఫీజు, రెండోసారి సగం ఫీజు మాత్రమే తీసుకుంటారు. వీటి నిర్మాణం కొత్తగా జరగడంతో కాంట్రాక్టర్లకు బీవోటీ గడువు 2031 వరకు ఉంది. అప్పటివరకు పాత పద్ధతిలోనే వసూలు చేస్తారు. మిగిలిన 65టోల్ ప్లాజాల్లో ఫాస్ట్ టాగ్ కోతలు తప్పడం లేదు.

# పార్టీకి తలనొప్పిగా మారిన కొలికపూడి

**విజయవాడ :** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి తలనొప్పిగా తయారైన ఎమ్మెల్యేల్లో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఒకరు. పార్టీ నేతలతో వివాదాలు, కర్ర పెత్తనం, దూషణలతో తీరు మార్చుకోమని పార్టీ పెద్దలు పదేపదే చెబుతున్నా ఆయనలో మాత్రం మార్పు రావడం లేదు.ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం బెల్ట్‌షాపులపై దాడుల పేరుతో చేసిన హడావుడితో టీడీపీ ఇరకాటంలో పడింది. రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్‌షాపులే లేవని ఓ పక్కన ఎక్సైజ్ మంత్రి మొదలుకుని ముఖ్యమంత్రి వరకు గొప్పలు చెబుతుంటే అధికార పార్టీ ఎమ్మెల్యే రోడ్లపై పరుగులు తీస్తూ బెల్ట్ దుకాణాల్లో తనిఖీలు చేస్తూ, అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకోవడం కలకలం రేపింది. ఎమ్మెల్యే ఇలా ఎందుకు చేశారనే దానిపై రకరకాల వాదనలు ఉన్నా టీడీపీ నేతలు మాత్రం ఎమ్మెల్యే తీరును తప్పు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే కొలికపూడి కంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్ అయ్యారు.అధ్యాపక వృత్తి నుంచి అమరావతి ఉద్యమంలోకి అడుగుపెట్టిన కొలికపూడి శ్రీనివాసరావును ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రిజర్వుడు నియోజక వర్గం నుంచి పోటీ చేసే అవకాశం లభించింది. కూటమి ప్రభంజనంలో సునాయసంగానే గెలిచారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యే తీరులో ఒక్కసారిగా మార్పు వచ్చింది. నియోజక వర్గం మొత్తం తన చెప్పు చేతల్లో ఉండాలనే ధోరణిలో ఉండటంతో స్థానికంగా విభేదాలు మొదలయ్యాయి. దీనికి తోడు స్థానికంగా ఉండే కుల, వర్గ రాజకీయాలు కూడా ఎమ్మెల్యేకు మింగుడు పడలేదు. తిరువూరులో ఉండే కుల ఆధిపత్య ధోరణులు కూడా ఎమ్మెల్యే వైఖరికి కారణమనే ప్రచారం కూడా ఉంది.

ఎమ్మెల్యేగా ఎన్నికైన నెలరోజుల్లోనే.. ఈ ఏడాది జూలైలో ఎ.కొండూరు మండలం కంభంపాడులో వైసీపీ నాయ కుడు పంచాయతీ స్థలం ఆక్రమించి, భవనం నిర్మిస్తు న్నాడని ఆరోపిస్తూ ఆ భవనం వద్దకు వెళ్లి జేసీబీతో దానిని పడగొట్టాల్సిందేనని ఆందోళనకు దిగారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటా మని అధికారులు చెప్పినా వినకుండా అక్కడే బైఠాయించారు. ఈ ఘటన సంచలనం కావడంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉండవల్లి పిలిపించుకుని మందలించారు.ఆ తర్వాత పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారనే నెపంతో టీడీపీ ప్రజాప్రతినిధిని అందరి ముందు బట్టలిప్పి కొడతానంటూ బెదిరించడంతో అతని భార్య ఆత్మహత్యా యత్నం చేసింది. దీంతో అతని వర్గం నాయకులు విజయవాడలో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగడం కలకలం రేపింది. తిరువూరులో మట్టి తరలింపుపై మీడియాలో వార్తలు రావడంతో వారిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఎమ్మెల్యేపై స్థానిక నాయకులు టీడీపీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే ఉండగానే నియోజక వర్గానికి మరో ఇన్‌ఛార్జిని నియమించారు. పార్టీలో ఇతర నేతలు జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో తీరు మార్చుకుంటానని బహిరంగంగా ప్రకటించారు మళ్లీ కొలికపూడి చెలరేగిపోయారు. వీధుల్లో పరుగులు తీస్తూ మద్యం దుకాణాల వద్ద హంగామా చేశారు. ఉదయాన్నే మద్యం షాపులకు వెళ్లి బెల్టు షాపులు నిర్వహిస్తున్నారంటూ షాపులకు తాళాలు వేయిం చారు. షాపు తాళాలు తీస్తే ఊరుకోనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరువూరు పట్టణంలో ఉన్న షాపుల్ని పట్టణ శివార్లలో పెట్టుకోవాలని, బెల్టుషాపుల్ని తొలగించకపోతే తానే తొలగిస్తానంటూ మండిపడ్డారు.తిరువూరు నియోజక వర్గంలో ఉన్న 16 మద్యం షాపుల్లో తిరువూరు పట్టణంలో 4, రూరల్‌లో 2, గంపలగూడెంలో 4, ఎ. కొండూరులో 2, విస్సన్నపేటలో 4 షాపులు ఉన్నాయి. మద్యం వ్యాపారంపై ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం దుకాణాలు మూయించడంపై నిర్వాహకులు బిత్తరపోతున్నారు. ఎమ్మెల్యే వేధింపులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నారు. మరోవైపు టీడీపీ అధిష్టానం కూడా ఎమ్మెల్యే వ్యవహార శైలిపై విచారణ జరుపుతోంది.

# జనవరి 10 నుంచి వైకుంఠ దర్శనాలు

**తిరుమల :** తిరుమల తిరుపతి దేవస్థానం జనవరి 10, 2025 నుండి జనవరి 19, 2025 వరకు తిరుమలలో జరిగే పవిత్రమైన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభించింది. 10 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలపై టీటీడీ ఈవో జె.శ్యామలారావు, అదనపు ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి అన్నమయ్య భవన్‌లో ఏర్పాట్లు నిర్వహించి, సమీక్ష చేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ఈ నెల 23న ఉదయం 11 గంటలకు 10 రోజుల శ్రీవాణి టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారని ఈవో తెలిపారు. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు 10 రోజుల ఎస్‌ఈడీ టోకెన్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారన్నారు.శ్రీవాణి ట్రస్ట్-లింక్డ్ వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్ల కోటాను డిసెంబరు 23న ఆలయ నిర్వాహకులు విడుదల చేస్తారని శ్యామలరావు చెప్పారు. ఉత్సవ కాలానికి సంబంధించిన రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటాను కూడా టీటీడీ విడుదల చేస్తుంది. టీటీడీ ఉత్సవాల్లో భాగంగా 10 రోజుల పాటు తిరుపతిలో ఎనిమిది టికెట్ కౌంటర్లు, తిరుమలలో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తుంది.టోకెన్లు లేదా టికెట్లు ఉన్న భక్తులు మాత్రమే శ్రీవారి దర్శనానికి అనుమతి ఉంటుంది. టోకెన్ లేని భక్తులు తిరుమలకు రావచ్చు గానీ వారికి దర్శనం లభించదు. టోకెన్లు లేదా టికెట్లు లేని భక్తులను క్యూ లైన్లలోకి అనుమతించరు. వైకుంఠ ఏకాదశి నాడు తెల్లవారుజామున 4:45 నిమిషాలకు ప్రొటోకాల్ దర్శనాలు ప్రారంభమౌతాయి. ఈ క్రమంలో వైకుంఠ ఏకాదశి రోజున వేదాశీర్వచనాలు కూడా రద్దవుతాయి. ఆ రోజున ఉదయం 9 నుండి 11 గంటలు వరకు స్వామివారు స్వర్ణ రథంపై ఊరేగుతారు. వైకుంఠ ద్వాదశి రోజున తెల్లవారు జామున 5:30 నుండి 6:30 వరకు శ్రీవారి పుష్కరిణిలో టీటీడీ అధికారులు చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.వైకుంఠ ఏకాదశి రోజు (జనవరి 10) దర్శనానికి ప్రోటోకాల్ వీఐపీలను మాత్రమే అనుమతిస్తామని టీటీడీ ప్రకటించింది. ఉత్సవాల కోసం భారీ యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, 10 రోజుల పండుగ కాలంలో తిరుమలలో వేదాశీర్వచనం, అన్ని రకాల విశేష దర్శనాలను ఆలయ సంస్థ రద్దు చేసింది. కాగా, సంప్రదాయం ప్రకారం, జనవరి 10న తిరుమలలో జరిగే స్వర్ణ రథోత్సవం, మరుసటి రోజు వైకుంఠ ద్వాదశి సందర్భంగా చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజుకు 3.5 లక్షల లడ్డూలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేయడంతో పాటు 3.5 లక్షల లడ్డూలను టీటీడీ బఫర్ స్టాక్‌లో ఉంచనుంది.

### టీటీడీ నిర్ణయాలివే..

వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ఈ నెల 23న ఉదయం 11 గంటలకు 10 రోజుల శ్రీవాణి టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.ఈ నెల 24న ఉదయం 11 గంటలకు 10 రోజుల ఎస్‌ఈడీ టోకెన్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. జనవరి 10 నుంచి 19 వరకూ 10 రోజులకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తిరుపతిలో 8 కేంద్రాలు, తిరుమలలోని ఒక కేంద్రంలో సర్వదర్శనం టోకెన్లు కేటాయిస్తారు. తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి, జీవకోన, రామానాయుడు స్కూల్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్, తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనంలో టోకెన్లు కేటాయిస్తారు. టోకెన్ జారీ కేంద్రాల వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సీఈకి ఆదేశం. టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనాలకు అనుమతి ఇస్తారు. టోకెన్లు లేని భక్తులను దర్శన క్యూలైన్లలోకి అనుమతించరు. వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం 04:45 గంటలకు ప్రోటోకాల్ దర్శనాలు ప్రారంభం కాగా.. అధిక రద్దీ కారణంగా ఆ రోజున ఆలయంలో వేదాశీర్వచనం రద్దు చేశారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ స్వర్ణరథం, ఉదయం 5:30 నుంచి 6:30 వరకూ శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతాయి. గోవిందమాల భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన సదుపాయం ఉండదు.

### 100 సంవత్సరాల

# మెదక్ చర్చి



**మెదక్ :** మెదక్ కేథడ్రల్.. దక్షిణ భారతదేశంలో అత్యధికంగా సందర్శించే చర్చిల్లో ఒకటి. దీనిని బ్రిటిష్ వెస్లియన్ మెథడిస్టులకు చెందిన చార్లెస్ వాకర్ పోస్నెట్ నిర్మించారు. 1914 - 1924 మధ్య దాదాపు 10 సంవత్సరాల నిర్మాణం తర్వాత.. డిసెంబర్ 25, 1924న దీన్ని ప్రారంభించారు. బ్రిటిష్ వెస్లియన్ మెథడిస్టులు మెదక్ చర్చిని నిర్మించారు, దీనిని డిసెంబర్ 25, 1924న పవిత్రం చేశారు. 1914లో కరువు సమయంలో.. ఈ ప్రాంతానికి సహాయం చేయడానికి.. పనికి ఆహారం కార్యక్రమంలో భాగంగా ఈ చర్చిని నిర్మించారు.మెదక్ చర్చిని గోతిక్ రివైవల్ శైలి కేథడ్రల్, ఎత్తైన స్తంభాలు, తడిసిన గాజు కిటికీలు, రాతి శిల్పాలతో నిర్మించారు. ఇది 100 అడుగుల వెడల్పు, 200 అడుగుల పొడవు ఉంటుంది. దాదాపు 5,000 మందికి వసతి కల్పించగలదు. చర్చి పైకప్పు బోలు స్పాంజ్ మెటీరియల్‌తో సౌండ్‌ప్రూఫ్‌తో నిర్మించారు. బెల్ టవర్ 175 అడుగుల ఎత్తులో ఉంటుంది.ఈ చర్చి తెలంగాణలోని మెదక్ జిల్లాలో ఉంది. దక్షిణ భారతదేశంలో అత్యధికంగా సందర్శించే చర్చిల్లో ఇది ఒకటి. మరో విశేషం ఏంటంటే.. భారతదేశంలో ఎక్కువ ఫొటోలు తీసింది ఈ చర్చినేమెదక్ చర్చి దక్షిణ భారతలో బిషప్ స్థానం దక్కించుకుంది. మెదక్ డయోసెస్ ఆసియాలో అతిపెద్దది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద డియోసెస్ ఇక్కడే ఉంది.మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయి. విదేశాలు, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తారు. క్రిస్మస్ రోజున ఈ చర్చి లోపల బోధించే ప్రసంగం పట్టణం అంతటా వినబడుతుంది. పురాతన మెదక్ కోట వరకు బోధనలు వినబడతాయి

# అమరావతిపై పొంగులేటీ కామెంట్స్

## - మండిపడుతున్న ఏపీ నేతలు

**విజయవాడ :** "ఇటీవల అమరావతిలో వచ్చిన వరదలతో ఏపీకి పెట్టుబడులు వెళ్లే పరిస్థితి లేదు. వరదలతో ఏపీలో పెట్టుబడులు పెట్టే వారికి భయం పట్టుకుంది. ఏపీలో చంద్రబాబు అధికారం చేపట్టగానే రియల్ ఎస్టేట్ అమరావతికి పోతుందనేది ప్రచారం మాత్రమే. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోలేదు. హైదరాబాద్, బెంగళూరుకు పెట్టుబడిదారులు వస్తున్నారు" అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు.హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు తగ్గుతున్నాయని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వ పోకడలే కారణమని బీఆర్ఎస్ విమర్శలు చేస్తుంది. ఏపీలో అమరావతి పనులు మళ్లీ ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమరావతిపై హాట్ కామెంట్స్ చేశారు. ఏపీలో కూటమి సర్కార్ ఏర్పడడంతో...అమరావతికి మళ్లీ ఊతం లభించింది. గత ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని రాజధాని ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కింది. రాజధాని కోసం వేల ఎకరాలు ఇచ్చిన రైతులు, అమరావతి ప్రజల్లో కొత్త ఆశ చిగురించింది. ఇది కొంత వరకూ వాస్తవమే. అయితే రాత్రికి రాత్రే మారిపోయి, పెట్టుబడిదారులు క్యూ కట్టే పరిస్థితులు అమరావతిలో లేవనే చెప్పాలి. కూటమి ప్రభుత్వం రాగానే అమరావతిపై దృష్టి పెట్టి మొదటిగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఒక సంకేతం పంపింది. సీఆర్డీఏను రంగంలోకి దింపి రాజధాని అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రజల్లో నమ్మకాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుంది.ఇటీవల సీఆర్డీఏ భేటీలో రూ.24,276 కోట్ల పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతిలో మొత్తంగా రూ.45,249 కోట్ల పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్ నిర్మాణాలు, రాజధాని లే ఔట్‌లు, ట్రంక్ రోడ్లు, అసెంబ్లీ భవనాల నిర్మాణాలకు సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణానికి మొత్తం ఖర్చు రూ.62 వేల కోట్లుగా ప్రభుత్వం అంచనా వేస్తుంది. అమరావతి పనులకు కసరత్తు ప్రారంభం కావడంతో...రియల్ ఎస్టేట్ వ్యాపారుల చూపు అటుగా మళ్లింది. గతంలో కంటే భూముల రేట్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతానికి రోడ్లు తప్ప ఇతర మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో...భవిష్యత్ అవసరాలకు మాత్రమే భూములు కొనుగోలు చేస్తున్నారు.'అమరావతి, చుట్టుపక్కల ప్రభుత్వ, ప్రైవేట్ భూములు సుమారు 50,000 ఎకరాల వరకు అందుబాటులో ఉన్నాయి. గతంలో చదరపు గజం రూ. 15,000 ట్రెండ్ అవ్వగా...ఇటీవల చదరపు గజం రూ. 25,000 ధరకు చేరింది' అని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అన్నారు. రియల్ ఎస్టేట్ బూమ్ ప్రారంభం అయ్యిందని, వార్షిక ప్రాతిపదికన భూముల రేట్లు పెరిగే అవకాశం ఉందని రియల్ వ్యాపారులు భావిస్తున్నారు. మరో 18 నెలల్లో భూముల ధరలు రెట్టింపు అవుతాయని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న కొన్ని భవనాల పనులు ప్రారంభించిందని, వీటిలో 80 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, బ్యూరోక్రాట్‌లు, శాసనసభ్యులు, న్యాయమూర్తుల నివాస గృహాలు ఉన్నాయని సీఆర్డీఏ అధికారులు పేర్కొన్నారుహైదరాబాద్, బెంగళూరులో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో... భవిష్యత్ అవసరాల కోసం కొందరు అమరావతి వైపు వస్తున్నారని రియల్ వ్యాపారులు అంటున్నారు. జనవరి2025 నుంచి బెంగళూరు, హైదరాబాద్‌లతో పోటీ పడుతూ అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతుందని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు, వరల్డ్ బ్యాంక్, ఏడీబీ రుణాలు సకాలంలో అందితే అమరావతి రియల్ రంగంలో మరింత స్పీడ్ అందుకుంటుందని స్థానిక వ్యాపారులు భావిస్తున్నారు. అమరావతిలో ఇప్పటికే కొన్ని పనులను పునఃప్రారంభం కావడంతో భూముల ధరలకు రెక్కలు వస్తు?న్నాయి. స్థానిక రియల్టర్ల ప్రకారం అమరావతి గ్రామాలలో భూముల ధరలు 60% నుంచి 100% వరకు పెరిగి చ.గజం రూ. 50,000 తాకవచ్చని తెలుస్తోంది.గత 10 ఏళ్లలో అమరావతి రియల్ ఎస్టేట్ రంగం ఎన్నో కుదుపులు చూసింది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత అప్పటి సీఎం చంద్రాబాబు అమరావతిని రాష్ట్రానికి రాజధానిగా ప్రకటించడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రియల్ ఎస్టేట్ రంగంపై ఎన్నో ఊహాగానాలు వచ్చాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడం, వైఎస్ జగన్ మూడు రాజధానుల ప్రతిపాదనతో అమరావతి ధరలు అమాంతం తగ్గిపోయాయి. అమరావతిలో 2019లో చదరపు గజానికి రూ.25,000-రూ.40,000 వరకు ఉండగా..జగన్ ప్రభుత్వ హయాంలో వీటి ధరలు రూ.9,000-రూ.18,000కి పడిపోయాయని ఓ రియాల్టీ వ్యాపారి అన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో అమరావతి భూముల ధరలు పెరుగుతున్నాయి. మొత్తం 29 గ్రామాల్లో ఎకరాకు రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు.భూముల ధరలు భారీగా పెరగడంతో అమరావతిపై పెట్టుబడిదారులకు ఆసక్తి ఉందని తెలుస్తోంది. వెలగపూడి, కొండంపాలెం, వీఐటీ, ఎస్ఆర్ఎం వంటి విద్యాసంస్థలకు సమీపంలోని ప్రాంతాల్లో వాణిజ్య, నివాస ప్రాజెక్టుల ధరలు భారీగా పెరుగుతున్నాయని స్థానిక డెవలపర్స్ చెబుతున్నారు. అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో, హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెట్టుబడిదారులు ఏపీకి తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారని, రాబోయే కొన్నేళ్లలో ఈ ప్రాంతంలో ఆశాజనక ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని అమరావతి రియల్ వ్యాపారులు అంటున్నారు.అమరావతి రియల్ ఎస్టేట్ ప్రభావం హైదరాబాద్ పడుతుందనే ఆలోచనలో తెలంగాణ మంత్రి పొంగులేటి...నెగిటివ్ కామెంట్స్ చేసి ఉంటారని కొందరు వ్యాపారులు అంటున్నారు. ఇటీవల హైదరాబాద్ లో కూడా వరద పరిస్థితులు కనిపిస్తున్నాయని, చెన్నై, బెంగళూరులో సైతం వర్షాలు చాలా ప్రాంతాలు నీటి మునుగుతున్నాయని చెబుతున్నారు. పొంగులేటి వ్యాఖ్యలను రాజకీయ కోణంలోనే చూడాలని టీడీపీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టేందుకు పొంగులేటి అమరావతి ప్రస్తావన తెచ్చి ఉంటారని భావిస్తున్నారు. అమరావతితో పాటు సాగర నగరం విశాఖలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

# సముద్రంలో ఫెర్రీని ఢీకొట్టిన నేవి స్పీడ్ బోటు



**ముంబాయి** ముంబై దగ్గర అరేబియా సముద్రంలో జరిగిన పడవ ప్రమాదం జరిగింది. ఒక నేవీ స్పీడ్ బోట్ వేగంగి వచ్చి గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెంటా దీవులకు పర్యాటకులతో వెళ్తున్న ఫెర్రీని ఢీకొట్టింది. దీంతో ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది.ఘటనలొఓ పదమూడు మంది మృతి చెందారు. నేవీ బోట్ లో ఐదుగురు వుండగా ఫెర్రీలో 110మంది ప్రయాణికులు వున్నారు. మృతుల్లో ముగ్గురు నేవి సిబ్బంది వున్నారు. 101 మందిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. నేవీ బోటు మరమత్తుల అనంతరం పరీక్షలు చేస్తుండగా అదుపు తప్పినట్లు నేవీ ప్రకటించింది.డవ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధాని మోదీ ?2లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ?50,000 చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించారు.నౌకా దళం, కోస్ట్ గార్డు సహాయక చర్యలు చేపట్టాయి. పదికొండు నేవి బోట్లు, మెరైన్ పోలీసుల మూడు బోట్లు బాధితులను రక్షించాయి.

## కీర్తిసురేష్ దంపతులతో

# విజయ్ దళపతి



నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి కీర్తిసురేశ్ –ఇటీవలే ఆంథోని తటిల్‌తో వివాహబంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే.ఆంథోని తటిల్ హిందూ సంప్రదాయ పద్దతిలో కీర్తిసురేశ్ మెడలో మూడు ముళ్లు వేశాడు. ఆ తర్వాత క్రిస్టియన్ సంప్రదాయంలో కూడా పెళ్లి చేసుకున్నారు. కొత్త జీవితంలోకి అడుగుపెట్టిన కీర్తిసురేశ్ దంపతులకు ఇండస్ట్రీ ప్రముఖులు, స్నేహితులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. తాజాగా స్టార్ హీరో నవ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఫొటోలతోపాటు వెడ్డింగ్ గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతోంది. సంప్రదాయ వస్త్రధారణలో వధూవరులిద్దరు కలర్‌ఫుల్‌గా మెరిసిపోతున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో తో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ నటుడు వరుణ్ ధవన్‌తో కలిసి కీర్తిసురేశ్ నటిస్తోన్న బేబిజాన్ సినిమా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. బేబిజాన్ కీర్తిసురేశ్‌కు హిందీలో తొలి సినిమా.

## తగ్గేదేలే.. బేబీజాన్ ప్రమోషన్‌లో

# మంగళసూత్రంతో కీర్తిసురేష్


బాలీవుడ్ నటుడు వరుణ్ ధవన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం బేబీ జాన్. నేషనల్ అవార్డు విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేశ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది కీర్తిసురేశ్. డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవాప్తంగా క్రిస్మస్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది బేబిజాన్ టీం. కాగా కీర్తిసురేశ్ ఇటీవలే ఆంథోని తటిల్‌తో వివాహబంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. వెడ్డింగ్ తర్వాత కూడా ఏ మాత్రం కాంప్రమైజ్ కాకుండా పక్కా ప్రొఫెషనల్‌గా కనిపిస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. రెడ్ డ్రెస్‌లో టీంతో కలిసి కనిపించగా.. మెడలో మంగళసూత్రం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మొత్తానికి పెళ్లి తర్వాత కూడా సినిమాల విషయంలో ఏ మాత్రం తగ్గేదే లే అంటూ చెప్పకనే చెబుతోందంటున్నారు నెటిజన్లు, అభిమానులు, ఫాలోవర్లు. అంతేకాదు పెళ్లి తర్వాత వస్తున్న హిందీ డెబ్యూ సినిమా సక్సెస్ అవ్వాలని విష్ చేస్తున్నారు.



## థియేటర్లలోనే

# ఇండియన్-3

కమల్‌హాసన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ భారతీయుడు. శంకర్ దర్శకత్వంలో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ ఫ్రాంఛైజీలో ఇప్పటికే ఇండియన్ కూడా వచ్చిందని తెలిసిందే. ఈ ఏడాది జులై 12న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకుల అంచనాలు అందుకోలేకపోయింది. వాయిదాల మీద వాయిదాలు పడి విడుదలైన సీక్వెల్ నిర్మాతలకు నష్టాలనే మిగిల్చడంతో ఇక మూడో పార్ట్ ఇండియన్ 3ని థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో విడుదల కానుందంటూ ఇప్పటికే నెట్టింట వార్తలు రౌండప్ చేస్తున్నాయి. ఇండియన్ 2 అలాంటి నెగెటివ్ రివ్యూస్ వస్తాయని అస్సలు ఊహించలేదు. సరేనంటూ ముందుకెళ్లాను. నేను నా వర్క్‌ను నమ్ముతా. అదేంటో గేమ్ ఛేంజర్, ఇండియన్ 3 సినిమాలే చెబుతాయి. ఈ రెండు సినిమాలు తప్పకుండా థియేటర్లలో ఎంజాయ్ చేసే విధంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశాడు. అంతేకాదు ఇండియన్ 3 థియేటర్లలో విడుదల కానుందని క్లారిటీ ఇచ్చేశాడు. దీంతో కమల్ హాసన్ అభిమానులు ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నారు. తాజా టాక్ ప్రకారం గేమ్ ఛేంజర్ విడుదలైన తర్వాత ఇండియన్ 3 ప్రమోషన్స్ కూడా షురూ చేయబోతుందట శంకర్ టీం. అంతేకాదు ట్రైలర్ కూడా త్వరలోనే థియేటర్లలో సందడి చేయబోతుందని ఇన్‌సైడ్ టాక్. సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేసేలా ట్రైలర్ ఉండబోతుందట. ఇంకేంటి మరి తక్కువ టైంలోనే శంకర్ అభిమానుల కోసం రెండు సినిమాలు రాబోతున్నాయన్న మాట.



## అలాంటి అబ్బాయి

# కావాలి : రష్మిక

అగ్ర కథానాయిక రష్మిక మందన్న వరుస సినిమాలతో బిజీగా ఉంది. 'పుష్ప–2' విజయోత్సాహంలో ఉన్న ఈ భామ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. తన లైఫ్‌లోకి రాబోయే భాగస్వామి ఎలా ఉండాలో వివరించింది. జీవితంలోని ప్రతీ మలుపులో అతను తోడుండాలని, కష్టసమయంలో అండగా నిలబడాలని, అన్నివేళల్లో భద్రతనివ్వాలని చెప్పింది. రష్మిక మందన్న మాట్లాడుతూ 'స్త్రీ పురుష సంబంధాల్లో పరస్పర గౌరవం, నమ్మకం చాలా ముఖ్యమైన అంశాలు. ఒకరిపట్ల ఒకరికి గౌరవం ఉంటే జీవితాంతం కలిసి ఉండొచ్చు. కోపతాపాలకు దూరంగా అర్థం చేసుకునే సహృదయత కలిగి ఉండాలి. అలాంటి అబ్బాయే కావాలనుకుంటున్నా' అని చెప్పింది. జీవితానికి తప్పకుండా ఓ తోడు అవసరమని, మన కష్టాలను పంచుకునే వారు లేని జీవితాన్ని ఊహించలేమని రష్మిక మందన్న అభిప్రాయపడింది. ప్రస్తుతం ఆమె 'ది గర్ల్‌ఫ్రెండ్' 'రెయిన్‌బో' 'సికందర్' 'ఛావా' 'కుబేర' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## ట్రిపుర్‌ఆర్ డాక్యుమెంటరీకి అడ్వాన్స్ ఒపెన్

దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ చిత్రం ఆర్‌ఆర్‌ఆర్. అగ్ర కథానాయకులు ఎన్టీఆర్, రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటించగా బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ కథానాయికగా నటించింది. డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రం ఈ సినిమా 2021లో విడుదలై బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. అయితే ఈ సినిమా మేకింగ్ వీడియోను డాక్యుమెంటరీ రూపంలో తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఆర్‌ఆర్‌ఆర్– బిహైండ్ అండ్ బియాండ్'అంటూ రాబోతున్న ఈ డాక్యుమెంటరీ డిసెంబర్ 20న నేరుగా ఎంపిక చేసిన మల్టీప్లెక్స్ స్క్రీన్‌లలో విడుదల కానుంది. అయితే ఇప్పటికే ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయగా.. మంచి వ్యూస్ దక్కించుకుంది. అయితే రేపు ఈ డాక్యుమెంటరీ విడుదల కానుండగా.. బుక్ మై షోలో అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయినట్లు చిత్రబృందం ప్రకటించింది. వీటి టికెట్ ధరలు చూసుకుంటే.. రూ.200 నుంచి రూ.300 వరకూ ఉన్నాయి. మరోవైపు ఈ డాక్యుమెంటరీ రన్ టైం 1 గంట 38 నిమిషాలు ఉంది.





## ఆకట్టుకుంటున్న

# వెంకీ సాంగ్

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ కాంపౌండ్ నుంచి రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సంక్రాంతికి వస్తున్నాం. అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన మీను సాంగ్ ప్రోమో నెట్టింట చక్కర్లు కొడుతుండగా.. తాజాగా మేకర్స్ ఫుల్ లిరికల్ వీడియో సాంగ్‌ను లాంచ్ చేశారు. అనంత్ శ్రీరామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో, ప్రణవి ఆచార్య పాడారు. మీనాక్షి చౌదరి వెంకీను ఫాలో అవుతూ సాగే ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. వెంకీ నుంచి అభిమానులు కోరుకునే ఎలిమెంట్స్‌తో సాగుతున్న ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలువబోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మేకర్స్ ఇప్పటికే గోదారి గట్టు మీద రామసిలకవే.. ఓ.. గోరింటాకెట్టుకున్న సందమామవే సాంగ్ లాంచ్ చేయగా.. మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ దూసుకెళ్తోంది. భాస్కర భట్ల రాసిన ఈ పాటను రమణ గోగుల, మధుప్రియ పాడగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు. ఈ మూవీలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.



# ఎస్సీ వర్గీకరణ ఏ బి సి డి కి వ్యతిరేకంగా
# అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించినందుకు మాలెం మధు అరెస్ట్

**మంథని( ప్రశ్న న్యూస్)** గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని జాతీయమాల మహానాడు రామగుండం నియోజకవర్గ అధ్యక్షులు మాలెం మధు నిన్న ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ ఏబిసిడి వర్గీకరణమాలల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఇప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును తప్పుపడుతూ తెలంగాణ అన్ని మాల సంఘాలు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడం జరిగింది.ఈ సందర్భంగారామగుండం నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున మాల యువతి యువకులు ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని నిన్న ప్రెస్ మీట్ పెట్టి మాలెం మధు పిలుపునివ్వడం జరిగింది.ఈ సందర్భంగా వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి గారి ఆదేశాల మేరకు ప్రివెంటివ్ అరెస్ట్ చేసినవారు మాలెం మధు టౌన్ అధ్యక్షులు పిట్టల వెంకటి రామగుండం కన్వీనర్ మద్దెల శ్రీనివాశ్రీనివాస్ కడమండ శ్రీహరి దేవి లక్ష్మీనరసయ్య నారాయణ తదితరులు ఉన్నారు .




# ఉత్సాహంగా సి ఏం కప్ పోటీలు.



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సి ఏం కప్ 2024 జిల్లా స్థాయి పోటీలలో నాలుగవ రోజు బాలురు మరియు బాలికల విభాగం లో అథ్లెటిక్ మరియు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. రెండు క్రీడలలో కలిపి మొత్తం 400 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. పోటీల ముగింపు సమావేశానికి జిల్లా యువజన మరియు క్రీడల అధికారి నాగరాజు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ సి.ఏం కప్ 2024 జిల్లా స్థాయి క్రీడలలో నాలుగవ రోజు క్రీడల పోటీలు మెదక్ అవుట్డోర్ స్టేడియం మరియు పి.ఎన్.ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించామని అన్నారు. అథ్లెటిక్స్ లో 23 మంది బాలురు 23 మంది బాలికలు మొత్తం 46 మంది అలాగే షటిల్ బ్యాడ్మింటన్ నందు 8 మంది బాలురు 8 మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.గెలుపొందిన క్రీడాకారులు ఇదే నెల 27వ తేదీ నుండి హైదరాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. రేపు అనగా తేదీ 20-12-24న మెదక్ స్టేడియంలో పురుషులకు మరియు మహిళలకు చెస్ మరియు యోగ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం లో అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి దాసరి మధు మరియు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి శ్రీనివాసరావుతో పాటు పీ.డీలు శ్యామయ్య, రాజేందర్, వినోద్, మరియు వివిధ మండలాల నుండి విచ్చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

సూర్యాపేట(ప్రశ్న న్యూస్) సూర్యాపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సన్ క్రితం సింగ్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నిందితులు పాత నేరస్తులే, సూర్యాపేట బాలాజీ నగర్ కు చెందిన మర్రి వెంకటేశ్వరరావు విజయవాడలో చదువుతున్న తన కుమార్తె వద్దకు తన వ్యక్తిగా కారులో వెళ్తుండగా కొత్త బస్టాండ్ సమీపంలో ముగ్గురు వ్యక్తులు లిఫ్ట్ కావాలని కోరారు. అందుకు వెంకటేశ్వరరావు సదరు ముగ్గురు వ్యక్తులకు లిఫ్ట్ ఇచ్చాడు ఆ ముగ్గురు వ్యక్తులు మాట మాట కలిపి స్నేహపూర్వకంగా ఉన్నట్లు నటించారు అదే సమయంలో ఫోన్ నెంబర్లు కూడా మార్చుకున్నారు. విజయవాడ చేరుకుంటున్న సమయంలో వెంకటేశ్వరరావు కుమార్తె తినుబండారాలు తీసుకొనుటకు కార్ పార్కింగ్ చేశాడు, షాపుకు వెళ్లి తిరిగి వచ్చే లోపు పార్కింగ్ చేసిన కారు కనపడటం లేదు. వెంటనే తన కారు కోసం చుట్టుపక్కల వారిని వాకప్ చేశాడు. లిఫ్ట్ అడిగిన వారికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. వెంకటేశ్వరరావు అనారోగ్యంతో ఉండడంవల్ల వెంటనే పోలీస్ స్టేషన్కు వచ్చి కంప్లైంట్ చేయలేకపోయాడు. సూర్యాపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు ఫైల్



చేసిన సిబ్బంది. వారిపై నిగా పెట్టారు, ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండటంతో టౌన్ ఇన్స్పెక్టర్ వారిని అదుపులోకి తీసుకొని తనదైన శైలిలో విచారించగా నేరస్తులు దొంగతనాన్ని అంగీకరించారు. ఈ నేరస్తులు కార్లు అద్దెకి తీసుకొని మార్గమధ్యంలో డ్రైవర్ కు అతిగామద్యం సేవించి డ్రైవర్ నిద్రలోకి జారుకునే సమయంలో కార్లు దొంగతనం చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితుల వివరాలు హైదరాబాద్ కు చెందిన కూరపాటి నర్సింగరావు, బాత ప్రసాద్



గుంగంటి శ్రీకాంత్ గా గుర్తించారు కార్లతో పాటు 16 బైకులు స్వాధీనం చేసుకొని గురువారం కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలియజేశారు. ఈ నిందితులని అరెస్ట్ చేసిన వారిలో డీఎస్పీ రవి పర్యవేక్షణలో పట్టణ సీఐ వీర రాఘవులు, పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు, ఏడుకొండలు, కుశలవ, సైదులు, టెక్నికల్ సిబ్బంది, కరుణాకర్, కృష్ణ, శివ, సుధాకర్, రవి మధులను, జిల్లా ఎస్పీ రివార్డులతో అభినందించారు.

# విద్యావ్యవస్థ బలోపేతానికి సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలకపాత్ర పోషించారు

**పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ..**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** గత పది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు మెదక్, ఆదిలాబాద్, నిజామబాద్, కరీంనగర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ వారికి మద్దతుగా సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గత 15 సంవత్సరాలుగా విద్యా వ్యవస్థ బలోపేతానికి సమగ్ర శిక్ష ఉద్యోగస్తులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు వారి న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం నెరవేర్చాలని నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారుకలెక్టర్ ల ఆధ్వర్యంలో స్పష్టమైన నోటిఫికేషన్ ద్వారా సమగ్ర శిక్ష ఉద్యోగుల రిక్రూట్మెంట్ జరిగిందన్నారు.ఈ క్రమంలోని వీరంతా విద్యావ్యవస్థలో వీరు భాగమయ్యారని పేర్కొన్నారు.ఏ ప్రాతిపదికన రిక్రూట్మెంట్ జరిగిందో ఆ ప్రాతిపదికని వారిని రెగ్యులరైజ్ చేస్తూ. కనీస వేతనం కల్పించాలని, ఆరోగ్య బీమా, జీవిత బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెటర్నిటీ సెలవులకు సంబంధించి డిమాండ్లను ప్రభుత్వం. నెరవేర్చాలన్నారు.ప్రభుత్వ పెద్దలతో కూడా కొంతమంది ప్రజాప్రతినిధులతో మాట్లాడటం జరిగింది వారు కూడా కొంత సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తోంది అన్నారు... సమీప భవిష్యత్తులోని వీరి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆశిస్తున్నట్లు తెలిపారు.

# ప్రపంచ గర్వించదగ్గ మేధావి అంబేద్కర్

**అమిత్ షా బహిరంగ క్షమాపణలు చెప్పాలి**

**అంబేద్కర్ పై అమిత్ షా వాఖ్యలు వెనక్కి తీసుకోవాలి**

**మాదిగ జేఏసీ జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు**



**కొత్తగూడెం (ప్రశ్న న్యూస్)** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్పై కేంద్ర హెూంమంత్రి అమిత్షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని మాదిగ జేఏసీ జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు డిమాండ్ చేశారు. మాదిగ సంఘ జేఏసీ వనభోజన ఐక్య వేదిక కన్వీనర్ చదలవాడ సూరి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాదిగ జేఏసీ జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు, బహుజన సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వేల్పుల నర్సింహారావు మాట్లాడుతూ అంబేద్కర్, అంబేద్కర్ అంటూ పదే పదే అనడం ఇప్పుడు ఓ ఫ్యాషన్గా మారిందని, దీనికి బదులుగా దేవుడిని ఇన్నిసార్లు స్మరిస్తే.. స్వర్గానికి వెళ్లొచ్చని సాక్షాత్తు పార్లమెంట్ లో అమిత్ షా అనడం బాధాకరమన్నారు. దేశంలోనే ఉన్నతమైన పదవుల్లో ఉండి అంబేద్కర్ ను అవమానించడం సరికాదన్నారు. ప్రపంచ మేధావి అంబేద్కర్ ను అవమానించే హక్కు ఆయనకు లేదని, అంబేద్కర్ను అవమానించిన అమిత్ షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వలనే ఈరోజు పార్లమెంట్లో ఉన్నతమైన పదవి అనుభవిస్తున్న అమిత్ షా, ఆ మహానుభావుడు అంబేద్కర్ పెట్టిన బిక్షాన్ని మర్చిపోయి నోటికొచ్చినట్లు మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను కించపరిచి మాట్లాడినందుకు అమిత్ షా క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశంలో దళితుల సంఘాలు ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. లేని ఎడల విడతల వారిగా ధర్నా, నిరసన కార్యక్రమాలు, చలో ఢీల్లి కార్యక్రమం చేబడతామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో లాయర్ కే నాగేశ్వరావు, లాయర్ రమేష్, బిసి సంఘం జనరల్ సెక్రటరీ కురుమల్ల శంకర్, భూపతి శ్రీనివాస్, మాల మహానాడు నాయకులు బడుగు వీరాస్వామీ, నాగరాజు, సత్యనారాయణ, గుర్రం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నదని, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** గురువారం మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల మరియు కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, విద్యార్థుల మెనూ, డైనింగ్ హాల్ డార్మెంటరీ, స్టోర్ రూమ్ సంబంధిత వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుతూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని విద్యార్థులు కలిగించి ఉత్తమ విద్యా బోధన అందించాలని, నూతన మెనూ సక్రమంగా అమలు చేయాలని, మెనూ తయారు చేసే విధానంలో నైపుణ్యత సంపాదించుకునేలా వంట మాస్టర్లకు అవగాహన అవసరమని చెప్పారు. వంట వండడం వడ్డించడం అనే విధానాలు మార్పులు కనపడాలన్నారు మెనూ అమలపరిచే విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పు అని హెచ్చరించారు విద్యార్థినిలుఉన్నత చదువులు చదివి రాబోయే తరానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కొల్చారం సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ పై కేసు నమోదు హేయమైన చర్య

- ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కదారి పట్టించే చర్యలు
- కక్ష సాధింపు చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం పన్నాగాం
- బిఆర్ఎస్ నేతలపై బనాయించిన అక్రమ కేసులు వెంటనే రద్దు చేయాలి
- మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు



**కొత్తగూడెం (ప్రశ్న న్యూస్)** గత ఎన్నికల్లో ప్రజలకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవేర్చలేక ప్రజల్లో వస్తున్న ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ కు తెరలేపారని ఇందులో భాగంగానే బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ పై అక్రమ కేసులకు తెర లేపారని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఆటవిక పాలన సాగిస్తుందని ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయలేక ప్రతిపక్ష పార్టీల నేతలపై తప్పుడు కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజల్లో కేటీఆర్ కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారంతో అయన వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని విజ్ఞులైన తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోబోరని వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వెంటనే ఆయనతో పాటు బిఆర్ఎస్ నేతలపై పెట్టిన తప్పుడు కేసులు విరమించుకుని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ రాష్ట్రంలో మరో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుందని ఈ నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పార్టీ నేతలు కార్యకర్తలు విశ్రమించబోరనీ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వాదులు ఇటువంటి అప్రజాస్వామిక విధానాలను ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

# బుజరంపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కౌడిపల్లి గోపాల్



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** కౌడిపల్లి మండల పరిధిలోని బుజరంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా కౌడిపల్లి గోపాల్ ను ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా నూతన గ్రామ అధ్యక్షుడు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు బుజరంపేట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్తను కలుపుకుంటూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని వారు తెలిపారు నాపై నమ్మకం ఉండి గ్రామ అధ్యక్షుడిగా నియమించిన కాంగ్రెస్ పార్టీ జిల్లాఅధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ , నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన నూతన గ్రామ అధ్యక్షుడు కౌడిపల్లి గోపాల్.

# మచ్చలేని నాపై బురద జల్లుతున్న వారికి ఇది నా హెచ్చరిక

**సెంటు భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా నేను సిద్ధమే**



ధర్పల్లి(ప్రశ్న న్యూస్)నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కుంట కబ్జా అని ఒక పేపర్లో రాయడం మూలంగా కాంగ్రెస్ నాయకుల అంటే మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉంటుంది. అందుకే ధర్పల్లి ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘం సొసైటీ లో ఈ ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగింది. కబ్జాలు చేయడం లేదు అది పట్టా ఉన్న వ్యక్తులే వారి భూమి లో మొరం పోసుకుంటున్నారు.ఎవరైతే ఆరోపణలు చేస్తున్నారో వారికి ఈ ప్రెస్ మీట్ ద్వారా హెచ్చరిక చేస్తున్నాను నా భూమి ఐదుగురు పట్టాదారులను దాటిన తర్వాత ఉంది అది కూడా నేను కొన్న భూమి ఇక విషయానికి వస్తే మొరం పోసే భూమి నలుగురు గంగపుత్రుల పేరిట ఉంది అది సేత్వార్ పట్ట ఎవరికైనా అనుమానం ఉంటే ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి వివరాలు తీసుకోవచ్చు మాజీ ప్రజా ప్రతినిధులుగా ఉంటున్న వారు స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర్లో ఉన్నందున గ్రామ ప్రజల దృష్టి వారి మీద పడకుండా ఇలా డ్రామా ట్రిక్స్ ప్లే చేస్తున్నారు. ఎవరు అవినీతిపరులు ఎవరు నిజాయితీపరులు ఇప్పుడు తేల్చాల్సిన బాధ్యత ప్రజల పైన ఉంది కాబట్టి ఇలాంటి చీప్ ట్రిక్స్ ప్లే చేయొద్దు దానికి వారం రోజుల తర్వాత వచ్చే గురువారం దర్పల్లి లో గల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో ఇలాగే బహిరంగ చర్చకు సిద్ధం కావాలంటూ హెచ్చరికలు పంపిస్తున్నా ధర్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, ఈ కార్యక్రమంలో ధర్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్రాజ్, సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి, జెసిబి శ్రీనివాస్, అరుగుల పెద్ద పెద్ద బాలయ్య, బొక్కల బాలయ్య, ఎలాల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను కాపాడుతుంది

# సిబ్బందేనా.?

- కాప్రా సర్కిల్ పరిధిలో న్యాక్ ఇంజనీర్, చైన్ మెన్ల దే రాజ్యం
- నాచారం, మల్లాపూర్ డివిజన్లో కూల్చివేతలు మరిచిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- నాచారం, మల్లాపూర్ డివిజన్ నుండి భారీగా వసూళ్లు వస్తున్నాయా.? అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారా.?








ప్రజాప్రశ్న

ప్రజా ప్రతినిధుల కనుసైగల్లో అక్రమ నిర్మాణాలు

**నాచారం (ప్రశ్న న్యూస్)** కాప్రా సర్కిల్ పరిధిలోని నాచారం మల్లాపూర్ డివిజన్లో అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతోంది ఇక్కడ అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేసి అక్రమ నిర్మాణాలను ఆపవలసిన బాధ్యత చైన్ మెన్, న్యాక్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్ పై ఉంది కానీ ఇక్కడ చైన్ మెన్ గా రాజు, న్యాక్ ఇంజనీర్ గా అశ్విని బాధ్యతలు చేపట్టిన నాటినుండి పరిస్థితులు పూర్తిగా మారిపోయినాయి. అక్రమ నిర్మాణాల జోరు భారీగా పెరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. నోటీసులు ఇస్తున్నామని చెప్పారు తప్ప ఎక్కడ మీడియాకు చూపలేదు దీనిపై స్థానికులు సైతం పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నాచారం మల్లాపూర్ డివిజన్లో అక్రమ నిర్మాణాలకు, అక్రమ సెల్లార్లకుజ్ అక్రమ అంతస్తులకు అసలు నోటీసులు ఇచ్చారా.? ఇస్తే రికార్డు మైంటైన్ చేశారా.? నోటీసులు ఇచ్చిన తర్వాత కూల్చివేతలు ఎందుకు చేయలేదు అన్నది ప్రశ్నార్థకంగా మారింది. జిహెచ్ఎంసి నియమ నిబంధనల ప్రకారం సమయానికి ఇచ్చారా.? లేక అధికారులకు సిబ్బందికి కాలం కలిసి వచ్చినప్పుడే ఇచ్చారా.? అన్న దాని పై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే కాకుండా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది భారీగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించారని దీనిపై గతంలో ఏసీపీగా విధులు నిర్వహించిన గిరిరాజ్ సైతం బహిరంగంగా పేర్కొన్న సంఘటనలు లేకపోలేదు. సిబ్బంది తన మాటలు వినడం లేదని సాక్షాత్ డిప్యూటీ కమిషనర్ దగ్గర తన గోడును వెల్లబుచ్చుకున్న సందర్భాలు కోకొలలు చైన్ మెన్ రాజు, న్యాక్ ఇంజనీర్ అశ్విని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా వాళ్లకు పూర్తిగా సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా మల్లాపూర్ డివిజన్లోని మణిక్ చంద్ కు వెళ్లే దారిలో అక్రమంగా వెలసిన కమర్షియల్ భవనానికి పూర్తిగా సహకరించారని రెండు అంతస్తులకు రెసిడెన్షియల్ అనుమతి తీసుకుని అక్రమ అంతస్తులు వేయడంతో పాటు ఎలాంటి సెట్ బ్యాక్ లు చేయకుండా పార్కింగ్ వదలవలసిన స్టిల్ట్ లో హెూటల్ నిర్వహిస్తూ జిహెచ్ఎంసి నియమ నిబంధనలను తుంగలో తొక్కిన నోటీసులు జారీ చేసిన అధికారులు సిబ్బంది ఎందుకు కూల్చివేతేలు చేయలేదో తెలపాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


ప్రజాప్రశ్న

మల్లాపూర్‌లో అక్రమ నిర్మాణాల జోరు

-అక్రమ నిర్మాణాలకు ఆ ప్రజా ప్రతినిధి అండదండలు పుష్కలం


ప్రజాప్రశ్న

రంగంలోకి దిగేది ఎవరు.?

ఏసిపి అవినీతి అక్రమాలు ఆపేదెవరు.?

## నోటీసులు ఇచ్చారా.? ఇస్తే ఎందుకు కూల్చలేదు

కాప్రా సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న న్యాక్ ఇంజనీర్లు, చైన్ మెన్ ల తీరే సపరేటు వీళ్ళు ప్రభుత్వ కార్యాలయంలో కాకుండా ప్రైవేటు ఆఫీసుల్లో డ్యూటీ చేస్తున్నట్లు బాధ్యతారహిత్యం గా వ్యవహరిస్తారని నోటీసులు ఎన్ని ఇచ్చారు, ఎప్పుడెప్పుడు ఇచ్చారు అన్నదానిపై కూడా మీడియాకు సమాధానం ఇవ్వరు అంతా గోప్యంగా ఉంచడం ఎందుకో మరి. ఇదే కాకుండా అక్రమ నిర్మాణదారులకు వీళ్లే పూర్తిగా సహకరిస్తూ అందిన కాడికి దండుకొని ఉన్నత అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో నాచారం, మల్లాపూర్ డివిజన్లో గత సంవత్సర కాలం నుండి కూల్చివేతలే లేవంటే సిబ్బంది ఎంత భారీ స్థాయిలో మేనేజ్ చేస్తున్నారో పరిస్థితి అర్థం చేసుకోవచ్చని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక చైన్ మెన్జ్ ఒక న్యాక్ ఇంజనీర్ వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టిస్తుంటే డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ మౌనం వహించడం విడ్డూరంగా మారింది. కాప్రా సర్కిల్ పరిధిలో సిబ్బంది సమయపాలన పాటించకపోవడం దాదాపు 12 గంటల వరకు విధులకు హాజరు కావడం విడ్డూరంగా మారిందని డిప్యూటీ కమిషనర్ ఈ విషయం తెలిసి కూడా ఏరోజు పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసిన విషయం అది బహిర్గతమే మీడియాకు తెలపకపోవడం వెనక అంతర్యం ఏమిటి ఆర్థికంగా అమ్ముడుపోయారా.? లంచాలు తీసుకొని మౌనంగా ఉన్నారా.? అందుకోసమే మీడియా దృష్టికి రాకుండా జాగ్రత్త పడుతున్నారా.? ఏమో వాళ్లకే తెలియాలి ఎందుకంటే మౌనం వహిస్తుంది వాళ్లే కాబట్టి. ఇప్పటికైన కాప్రా సర్కిల్ పరిధిలో న్యాక్ ఇంజనీర్, చైన్ మెన్ ల పనితీరుపై గత కొద్ది సంవత్సరాలుగా అనేక విమర్శలు ఉన్నాయి. కానీ వాళ్ళని పూర్తిస్థాయిలో ఇక్కడి నుండి తొలగించాలన్న చిన్న ఆలోచన కూడా ఉన్నత అధికారులకు రాకపోవడం ప్రజల దౌర్భాగ్యమో లేక ఉన్నత అధికారుల బాధ్యతారాహిత్యమో వాళ్లకే తెలియాలి.

## సహజీవనం తప్పుడు విధానం : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** సహజీవనం తప్పుడు విధానమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఇది సమాజ సిద్ధాంతాలకు వ్యతిరేకమన్నారు. స్వలింగ సంపర్కుల వివాహాలతో.. సామాజిక వ్యవస్థ దెబ్బతింటుందని ఆయన ఆరోపించారు. యూట్యూబ్ పోడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. బ్రిటన్‌లో అతి పెద్ద సమస్య సహజీవనమే అని, పెళ్లిని వ్యతిరేకించడం పెద్ద సమస్యగా మారినట్లు ఇటీవల బ్రిటీష్ పార్లమెంట్ వెళ్లినప్పుడు అక్కడ తమకు తెలిసిందన్నారు. ఒకవేళ మీరు పెళ్లి చేసుకోకపోతే, అప్పుడు మీరెలా పిల్లల్ని కంటారని గడ్కరీ అడిగారు. ఒకవేళ పిల్లలు పుడితే, వాళ్ల భవిష్యత్తు ఏంటి ఆయన ప్రశ్నించారు. సమాజ వ్యవస్థకు వ్యతిరేకంగా వెళ్తే, అది ప్రజలపై ఎటువంటి ప్రభావం చూపుతుందని ప్రశ్నించినట్లు తెలిపారు. సమాజం తనంతటే తాను నిర్ణయాలు తీసుకుంటుందని, కానీ దేశంలో లింగ నిష్పత్తి సమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ 1500 మంది మహిళలు, 1000 మంది పురుషులు ఉంటే, అప్పుడు ఇద్దరు భార్యలకు పురుషుల అర్వ్హులని ఆయన అన్నారు. ఆదర్శ భారత దేశంలో విడాకుల్ని బ్యాన్ చేయాలన్న దాన్ని ఆయన ఖండించారు. సహజీవనం మంచిది కాదన్నారు. సేమ్ సెక్స్ మ్యారేజ్‌ను వ్యతిరేకిస్తూ గత ఏడాది సుప్రీంకోర్టుకు చెందిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.

## అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు

- అసెంబ్లీ ముందు తెలంగాణ కాంగ్రెస్ నేతల ధర్నా
- తమకు దేవుడికన్నా ఎక్కువేనన్న పిసిసి చీఫ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని తెలంగాణ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పార్లమెంట్ లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగారు. అమిత్ షా అంబేద్కర్ ను అవమానపరిచారని.. ఆయన వెంటనే రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తూ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అసెంబ్లీలోని గాంధీ విగ్రహం దగ్గర ఆందోళన చేశారు.మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు ఆందోళనలో పాల్గొన్నారు. అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఈ ధర్నా చేస్తోంది. అంబేద్కర్ తమకు దేవుడు లెక్క అని, అమిత్ షా క్షమాపణలు చెప్పాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యతిరేకి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నినాదాలు చేసింది. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 'మేము దేవుళ్లను ఆరాధిస్తాం. డా.బీఆర్ అంబేద్కర్ కూడా మాకు దేవుడు లెక్క. అంబేడ్కర్‌పై చేసిన వాఖ్యలు ప్రజల మనుసుని గాయపర్చాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాటలు అగ్రవర్ణాల పోకడను గుర్తు చేసేలా ఉన్నాయి. అమిత్ షాను బర్ధరఫ్ చేస్తే ప్రజల మనసుకు కలిగిన గాయానికి కొంత ఊరట కలిగినట్లు ఉంటుంది. వెంటనే ప్రధాని మోడీ స్పందించి అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని పిసిసి చీఫ్ అన్నారు. ఈ ఆందోళనలో మంత్రి పొన్నంతో పాటు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ కుమార్,పలువురు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అంబేద్కర్..అంబేద్కర్. . అంబేద్కర్ అని అనడం ఈ మధ్య ఫ్యాషన్ అయిపోయింది.. అంబేద్కర్ పేరు కంటే.. దేవుడి పేరు స్మరించినా స్వర్గానికి వెళ్లేవారు అంటూ రాజ్యసభలో అమిత్ చేసిన వ్యాఖ్యలు గత రెండు రోజులుగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. అంబేద్కర్‌ను నిండు సభలో అమిత్ షా అవమానించారని.. ఆయన వెంటనే రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు ఆందోళనకు దిగాయి. గురువారం కూడా పార్లమెంట్ భవనం ముందు కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిలోని ఇతర పార్టీల ఎంపీల పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. అంబేద్కర్ చిత్రపటాలను చేతిలో పట్టుకుని జై భీం.. జై జై భీం నినాదాలతో ఎంపీలు హోరెత్తించారు.

# శుద్ధ అబద్ధమే కదా.!

## - చేరికలతో పార్టీ బలోపేతం అవుతుందా? అందులో నిజమెంత?

**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఒకింత డైలమాలో ఉంది. అధికారంలో ఉన్న పార్టీలో చేరేందుకు ఎవరైనా వస్తారు. చేరేందుకు ఉత్సాహం చూపుతారు. కానీ కార్యకర్తల మనోభావాలను కూడా తెలుసుకుని వ్యవహరించాల్సి ఉంటుంది. అప్పటి వరకూ తమపైన జులుం ప్రదర్శించిన నేతలనే చివరకు తమ జెండా కిందకు తీసుకురావడాన్ని కార్యకర్తలు అస్సలు హర్షించరు. పార్టీని బలోపేతం చేసుకోవడానికి చేరికలు అనివార్యమని అధినాయకత్వం భావించినప్పటికీ క్యాడర్ లో అసంతృప్తికి మాత్రం కారణం అయితీరుతుంది. గత ప్రభుత్వంలోనూ అదే జరిగింది. అప్పుడు కూడా టీడీపీ నుంచి అనేక మంది నేతలు పార్టీని వదలి వెళ్లిపోయారు. కానీ వాళ్లంతా తిరిగి పార్టీలో చేరేందుకు సిద్ధమవుతుండటం కార్యకర్తలకు మింగుడుపడటం లేదు.

### నాయకులు డమ్మీలే..

ప్రస్తుత రాజకీయాల్లో నాయకులు డమ్మీలు. వారు ఆర్థికంగా కొంత వరకూ ఓట్లను సంపాదించే వీలుంటుంది. అంతే తప్ప క్యాడర్ పోలింగ్ కేంద్రాల్లో అసలు సత్తా చూపించేది క్యాడర్ మాత్రమే. అలాంటి కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తే క్యాడర్ లో అసహనం బయలుదేరుతుంది. అది ఏ పార్టీకి అయినా మంచిది కాదు. గత వైసీపీ ప్రభుత్వహయాంలో ఇదే జరిగింది. ఎందరో నేతలను టీడీపీనుంచి చేర్చుకున్నా వారు ఇప్పటికే పార్టీని వదిలేశారు. అధికారం లేకపోతే నాయకులు ఉండరు. ఇప్పుడు టీడీపీలో చేరే నేతలు కూడా రేపు ఒకవేళ అధికారం కోల్పోతే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా అధికార పార్టీలోకి వెళ్లిపోతారు. ఈ సత్యాన్ని అధినాయకత్వం గ్రహిస్తే మంచిదన్న సూచనలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి.

### కష్టకాలంలో వదిలేసిన...

ఎమ్మెల్సీలుగా ఉన్న పోతుల సునీత, డొక్కా మాణిక్యవరప్రసాద్ లను పార్టీలో చేర్చుకోవడం వల్ల ఏం ప్రయోజనమంటూ క్యాడర్ నుంచి లీడర్ల వరకూ సూటిగా ప్రశ్నించారంటే అది చాలదూ అర్థం చేసుకోవడానికి. ఇక అంతటితో ఆగలేదు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాల్సిన సమయంలో జెండాను వదిలేసి ఐదేళ్లు అక్కడ ఎంజాయ్ చేసి మళ్లీ ఇక్కడ అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తే వారిని ఏమనాలి? వారి వెంట పదో ఇరవై మందో కార్యకర్తలు వస్తారు తప్పించి నియోజకవర్గంలో ఓటర్లు మొత్తం గంపగుత్తగా వచ్చే అవకాశం ఎంతమాత్రం లేదు. అయినా సరే పార్టీ బలోపేతం అని బూచిచూపెట్టి నేతలను చేర్చుకునే పనికి టీడీపీ నాయకత్వం సిద్ధమవుతుంది.

### బలహీనపర్చాలని...

అయితే ఇందుకు ప్రత్యర్థిని బలహీన పర్చాలనుకుంటుంది కానీ, జనంలో సానుభూతి వస్తుందన్న విషయం మాత్రం మరుస్తుంది.



తాజాగా ఇప్పుడు ఆళ్లనాని, అవంతి శ్రీనివాస్ వంటి వారు పార్టీలో చేర్చుకోవడానికి కారణాలు చెప్పమంటూ నేతల నుంచి కార్యకర్తలు నిలదీస్తున్నారంటే ఆలోచన చేయాల్సిన అధినాయకత్వం ఏమాత్రం వెనకడుగు వేయనంటుంది. రానున్న కాలంలో వైసీపీ నుంచి అనేక మంది వస్తారు. వచ్చిన వారందరినీ చేర్చుకుంటే గత ఐదేళ్లు జెండాను విడవకుండా మోసిన వాళ్లను ఏం చేయాలన్న ప్రశ్నకు నాయకత్వం వద్ద సమాధానం ఉండదు. అధినాయకత్వం పై నమ్మకంతో చేరుతున్నామని పచ్చిఅబద్ధాలు చెబుతూ చేరిన ఈ నేతలు మళ్లీ అధికారం కోల్పోతే వెంటనే బైబై చెప్పేందుకు సిద్ధమవుతారని గుర్తించకతప్పదు. టీడీపీ సోషల్ మీడియాలో కూడా ఇదే తరహా కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు

### - ఐదుగురు టెర్రరిస్టులు హతం



**శ్రీనగర్ (ప్రశ్న న్యూస్):** జమ్ముకశ్మీర్‌లోని కుల్గామ్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు టెర్రరిస్టులు హతమయ్యారు. కుల్గామ్ జిల్లాలోని బెహిబాగ్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం అందడంతో స్థానిక పోలీసులతో కలిసి భద్రతా దళాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ క్రమంలో ముష్కరులు భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడ్డారు. ప్రతిగా జరిపిన కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు చనిపోయారని ఇండియన్ ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. టెర్రరిస్టుల కాల్పుల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడినట్లు తెలిపింది. ఆ ప్రాంతంలో గాలింపు కొనసాగుతున్నదని పేర్కొంది. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని వెల్లడించింది. కాగా, ఈ నెల ఆరంభంలో శ్రీనగర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ ఉగ్రవాది చనిపోయాడు. అతడు గగన్‌గిర్, గందేర్బల్ ప్రాంతాల్లో సాధారణ పౌరులను హత్యలతోపాటు పలు ఉగ్ర దాడుల్లో పాల్గొన్నాడని అధికారులు వెల్లడించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588